గురువారం
04-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 13
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
# విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

### ఈజిప్టులో కొలువుదీరిన కొత్త కేబినెట్

కైరో: ఈజిప్టులో నూతన కేబినెట్ కొలువుదీరింది. రాజధాని కైరోలోని అల్ ఇత్తిహాదియా భవనంలో బుధవారం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా అల్ సిసీ హాజరయ్యారు. ప్రమాణ స్వీకారానికి ముందు అబ్దెల్ మగ్యూద్ సకర్‌ను లెఫ్టినెంట్ జనరల్ స్థాయి పదోన్నతిని సిసీ కల్పించారు. ఆయనను రక్షణశాఖ మంత్రిగా నియమించారు. ప్రధాని ముస్తఫా మద్బౌలీ కేబినెట్‌లో 30 మంది మంత్రులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం నేతృత్వంలో కొన్ని మంత్రిత్వశాఖలు విలీనం కాగా మరికొన్ని కొత్త శాఖలు ఏర్పాటయ్యాయి. ఆర్థికశాఖకు సంబంధించి మార్పులు చేర్పులు జరిగాయి. అధిక ధరల నియంత్రణ, ఉద్యోగావకాశాల కల్పనకు కొత్త ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని అధ్యక్షుడు సిసీ వెల్లడించారు.

## జార్ఖండ్ పీఠంపై హేమంత్ సోరెన్?

- శాసనసభాపక్ష నేతగా తిరిగి ఎన్నిక
- గవర్నర్‌కు రాజీనామా సమర్పించిన సీఎం చంపై సోరెన్
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరిన జేఎంఎం నేత హేమంత్

రాంచీ: జార్ఖండ్ రాజకీయాల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. హేమంత్ సోరెన్ మరోసారి సీఎం పీఠాన్ని అధిష్ఠించేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి పదవికి చంపై సోరెన్ బుధవారం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ రాధాకృష్ణన్‌కు అందించారు. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కార్యనిర్వాహక అధ్యక్షుడు హేమంత్ సోరెన్ ప్రభుత్వాన్ని ఏర్పాటుకు

- మిగతా 2 లో

## యువతిపై సామూహిక అత్యాచారయత్నం

- కారులో తిప్పుతూ యువకుల చిత్రహింసలు
- సహచర ఉద్యోగినిపైనే ఘాతుకం
- మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో యువతిపై జరిగిన సామూహిక అత్యాచారయత్నం ఘటన వెలుగులోకి వచ్చింది. యువతిని కారులో తిప్పుతూ ఆమెపై అత్యాచారం చేసేందుకు ఇద్దరు యువకులు ప్రయత్నించారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు అయిన యువతి రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేస్తుండగా... అదే కంపెనీకి చెందిన ఇద్దరు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు అత్యాచారం చేయబోయారు. బాధిత యువతి ఉద్యోగం కోసం కడప నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. ఆమె ఉప్పల్‌లో నివాసం ఉంటూ మియాపూర్‌లోని ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో సేల్స్ ట్రయినీగా పని చేస్తోంది. అయితే, అదే సంస్థలో సేల్స్ విభాగంలో పని చేస్తున్న ఇద్దరు యువకులు సంగారెడ్డి, జనార్దన్‌లు యువతికి మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లినట్లుగా ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సైట్ చూపిస్తామంటూ కారులో తీసుకెళ్లారని... అక్కడ తనకు కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి తనపై అత్యాచారానికి యత్నించారని, ఎట్టకేలకు వారి నుంచి తప్పించుకొని తాను పోలీసులను ఆశ్రయించినట్లు వెల్లడించింది. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేయగా... ఉప్పల్ పోలీసులు ఆ కేసును మియాపూర్ స్టేషన్ పరిధిలోకి బదిలీ చేశారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. యువతికి పోలీసులు వైద్య పరీక్షలు చేయించారు.

### రాజ్యసభ నుంచి
## విపక్షాల వాకౌట్

- ఖర్గేను మాట్లాడనివ్వాలని డిమాండ్
- అంగీకరించని ఛైర్మన్

2లో

- మోదీ ప్రసంగాన్ని బహిష్కరించిన ఇండియా ఎంపీలు: బీజేడీ మద్దతు

## అమరావతి విధ్వంసం

### తెలుగుజాతికి జగన్ ద్రోహం

- రాజధానిని నిర్మించి ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం
- ఉపాధి కల్పన, సంపద సృష్టికి ఇది కేంద్రం
- అమరావతిపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గత ఐదేళ్లలో అమరావతి రాజధానిని విధ్వంసం చేసి రాష్ట్రానికి అంచనాలకందనంత నష్టం చేకూర్చి తెలుగుజాతికి జగన్ తీరని ద్రోహం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో జగన్ లాంటి వ్యక్తిత్వం ఉన్న వారు తప్ప ఇంకెవరూ రాజధాని మార్పు నిర్ణయాన్ని తీసుకోరని, విధ్వంసానికి జగన్ ఒక కేస్ స్టడీగా సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో పుష్కలంగా వనరులు ఉన్నాయి...తెలివి తేటలు గల మానవ వనరులున్నాయి. పెట్టుబడుల కోసం ప్రపంచం వ్యాప్తంగా ఇక్కడికి వచ్చే అవకాశం ఉంది. అలాంటి రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు విధ్వంసంతో నాశనం చేశారని ఆయన మండిపడ్డారు. వెలగపూడి సచివాలయంలో రాజధాని అమరావతిపై బుధవారం శ్వేతపత్రం విడుదల చేశారు. సీఎం మాట్లాడుతూ రాష్ట్ర

- మిగతా 2 లో

## మళ్లీ ఉచిత ఇసుక

- మూడు నెలల్లో కొత్త విధానం అమలు
- రవాణా, లోడింగ్ చార్జీలపై అధ్యయన కమిటీ
- ప్రస్తుతం స్టాక్ పాయింట్లలోని నిల్వలు పంపిణీ
- గత ప్రభుత్వ విధానం వల్ల జరిగిన నష్టంపై నివేదిక
- రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బంగారం కంటే ప్రియమైన ఇసుక విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో వలే మళ్లీ ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తీసుకు రావాలని నిర్ణయించింది. సచివాలయంలో బుధవారం గనుల శాఖపై నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు సీఎం చంద్రబాబు తన నిర్ణయాన్ని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుదేలైన నిర్మాణ రంగానికి మరలా జవసత్వాలు అందించేందుకు ఉచిత ఇసుక పాలసీ అత్యవసరమని ముఖ్యమంత్రి భావించారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన ఉచిత ఇసుక పంపిణీ పథకాన్ని మరలా యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించారు. ఈ మేరకు సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. రవాణా, లోడింగ్ చార్జీల నిర్ణయంపై కలెక్టర్ల అధ్యక్షతన ఒక అధ్యయన కమిటీ ఏర్పాటు చేయాలని మంత్రికి

- మిగతా 2 లో

### ప్రధానితో నేడు చంద్రబాబు భేటీ

- మూడు రోజులు బస హస్తినలోనే
- కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీతో గురువారం ఉదయం సీఎం చంద్రబాబు భేటీ అవుతున్నారు. ఈ మేరకు సీఎంకు పీఎంవో నుంచి అధికారిక ఆహ్వానం అందింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సాయంత్రం దిల్లీకి బయలు దేరి వెళ్లారు. వెలగపూడి సచివాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వరుసగా వివిధ శాఖల సమీక్షలు నిర్వహించిన చంద్రబాబు రాత్రికి ప్రత్యేక విమానంలో దిల్లీకి చేరుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి చేపట్టిన ఆయన దిల్లీ పర్యటనకు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు, వివిధ శాఖల అధికారులను చంద్రబాబు కలవనున్నారు. బుధవారం రాత్రి ఎన్డీఏ పక్షాలకు చెందిన ఎంపీల విందు సమావేశంలో పాల్గొననుండగా, గురువారం ఉదయం 10.15 గంటలకు ప్రధానితో భేటీ కానున్నారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ శాఖల మంత్రులను కలవనున్నారు. శుక్రవారం ఉదయం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులు, విభజన అంశాలపై అధికారులు ఇప్పటికే నివేదిక రూపొందించినందున వాటిపై సంబంధిత మంత్రులతో చంద్రబాబు చర్చించనున్నారు.

## ఇదే సరైన సమయం

- రాష్ట్రానికి అవసరమైనవి రాబట్టాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విశాఖ: ఆంధ్రప్రదేశ్ సమస్యలను పరిష్కరించుకునేందుకు కేంద్రంలో అనుకూల పరిస్థితి ఉన్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వానికి టీడీపీ, వైసీపీ ఎంపీల మద్దతు అవసరమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కూడా ఇందుకు ప్రయత్నించాలని రామకృష్ణ కోరారు. విశాఖ మురళీనగర్‌లోని ఆహ్వాన ఫంక్షన్ హాల్‌లో రెండు రోజులుగా జరుగుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ మోదీ పాలనలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత పరిస్థితులను సానుకూలంగా మార్చుకుని ఏపీకి అవసరమైనవన్నీ రాబట్టాలన్నారు. పదేళ్ల పాటు అబద్ధాలు చెబుతూ పరిపాలన సాగించిన మోదీకి, ప్రజాస్వామ్యం గొంతు నొక్కి పోలీసు రాజ్యాన్ని నడిపిన జగన్‌మోహన్ రెడ్డికి తాజా ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని రామకృష్ణ అన్నారు. ఇచ్చిన హామీల అమలులో కేంద్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, సొంతంగా అధికారాన్ని చేపట్టలేక ఒంటెద్దు పోకడలతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగిందని విమర్శించారు. ఏకపక్షంగా కొత్త నేర చట్టాలను అమల్లోకి తెచ్చిందని, ప్రతిపక్షాల అభ్యంతరాలను నిర్లక్ష్యం చేసిందని వ్యాఖ్యానించారు. ప్రోటెం స్పీకర్, స్పీకర్ ఎన్నికలప్పుడూ నిబంధలను పట్టించుకోలేదని, డిప్యూటీ స్పీకర్ పదవి విపక్షాలకు ఇవ్వడం ఆనవాయితీ కాగా దానిని కాలదన్నే రీతిలో కేంద్రం వ్యవహరిస్తోందని రామకృష్ణ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై బీజేపీ వైఖరి మారలేదన్నారు. ఉక్కు కర్మాగారాన్ని నష్టాల్లోకి నెట్టి దానిని అమ్మేయాలని చూస్తోందని విమర్శించారు. జగన్ అధికారంలో ఉండాలా? వద్దా? అన్నదే అజెండాగా ఎన్నికలు జరిగాయని, మిగతాంశాలను పట్టించుకోలేదని గుర్తుచేశారు. ఎన్నికల వ్యవస్థపై దేశవ్యాప్త చర్చ అవసరమని రామకృష్ణ నొక్కిచెప్పారు. ఈవీఎంలపై ప్రత్యేక చర్చ జరగాలని, అభివృద్ధి చెందిన దేశాల్లో ఈవీఎంలను వాడటం లేదని ఆయనన్నారు. తాజా ఎన్నికల్లో ప్రధాన పార్టీలు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశాయని, ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజాస్వామ్యంపై ప్రజలకు విశ్వాసం పోతుందని రామకృష్ణ హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు పాల్గొన్నారు.

### ఇదీ లోకం!

### జగన్ కేసులపై
## రోజువారీ విచారణ

### తెలంగాణ హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌పై సీబీఐ కోర్టులో ఉన్న తన అక్రమాస్తుల కేసులను రోజువారీ విచారించాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. జగన్ కేసులపై రాష్ట్రానికి చెందిన కాపు సంఘం నాయకుడు హరిరామ జోగయ్య హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై వాదోపవాదనలు కొనసాగాయి. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు. ఇప్పటికే సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి పాలైన జగన్‌కు కనీసం ప్రతిపక్ష హోదా కూడా లభించలేదు. ఇదే సమయంలో రోజు వారీ విచారణకు హైకోర్టు ఆదేశించడంతో వైసీపీ శ్రేణులు కలవరం చెందుతున్నారు. ఇంతకుముందు సీఎంగా ఉన్న సమయంలో తన భద్రతా కారణాల రీత్యా కోర్టుకు హాజరు కాలేకపోతున్నారని ఆయన తరపు న్యాయవాదులు వాదించారు. ఇప్పుడు జగన్ మాజీ సీఎం

- మిగతా 2 లో

## డీఎస్సీలో చేరుస్తారా... తొలగిస్తారా?

- గిరిజన ఉపాధ్యాయుల పోస్టులపై సందిగ్ధం
- ఉద్యోగ భద్రతకు మంత్రి సంధ్యారాణి హామీ
- జిల్లాల్లో ఎస్జీటీల పెంపుపైనా దృష్టి
- వయోపరిమితి సడలింపుపై అధికారుల కసరత్తు !

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రకటంచిన డీఎస్సీ-2024లో ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల పోస్టులు తొలగిస్తారా లేక అలాగే ఉంచుతారా అనేదీ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. 16,347 టీచర్ పోస్టుల నోటిఫికేషన్ జారీకి అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఏ క్షణంలోనైనా డీఎస్సీ నోటిఫికేషన్ రానుంది. ఇంతలో గిరిజన సంక్షేమ పాఠశాలలకు చెందిన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు రోడ్డెక్కారు. డీఎస్సీలో తమ పోస్టులు భర్తీ చేస్తే తమకు చెందిన 1,143 ఉద్యోగాలు పోతాయంటూ ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు ఇంటి ఎదుట ఇటీవల ధర్నా నిర్వహించారు. 15 ఏళ్ల నుంచి తాము ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తూ, ప్రభుత్వానికి సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇప్పుడు తమ వయోపరిమితి మించిపోయిందని, దీంతో డీఎస్సీ పరీక్షలు రాయలేమని, కూటమి ప్రకటించిన పోస్టుల్లో తమ పోస్టులను యథాతథంగా ఉంచాలని నినదించారు. ఈ పరిణామాలతో ప్రభుత్వం సమాలోచనలో పడింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులతో సమీక్షించి, గిరిజన సంక్షేమ ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్లను అధ్యయనం చేసి, వారికి నష్టం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దాంతోపాటు డీఎస్సీ ఉద్యోగాలకు వయోపరిమితిని జనరల్ అభ్యర్థులకు(ఓసీ) 48 ఏళ్ల వరకు సడలించాలంటూ నిరుద్యోగుల నుంచి పెద్దఎత్తున వినతులు రావడంతో... దానిపై

- మిగతా 2 లో

# ఘనంగా బెలారస్ స్వాతంత్ర్య దినోత్సవం

మిన్స్క్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని బెలారస్ ఘనంగా నిర్వహించింది. జులై 3వ తేదీని స్వాతంత్ర్య దినోత్సవంగా జరుపుకోవాలని 1996, నవంబరు 24న జరిగింది. ప్రజాభిప్రాయాన్ని సేకరించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిర్ణయానికి 88.18శాతం అనుకూల ఓట్లు వచ్చాయి. అదే ఏడాది డిసెంబరులో అలెగ్జాండర్ లుకాషెంకో సంబంధిత తీర్మానంపై సంతకం చేశారు. జులై 3వ తేదీని రిపబ్లిక్ ఆఫ్ బెలారస స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటించారు. ఆ రోజును అధికారిక సెలవు దినంగా పేర్కొన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది జులై 3వ తేదీన అమరవీరులకు దేశ ప్రజలు ఘనంగా నివాళులు అర్పిస్తారు. బెలారస్ దేశ సాధన పోరులో విజయాన్ని వేడుక చేసుకుంటారు. 1944 జులై 3న మిన్స్క్‌కు విమోచనం లభించింది.

**అమెరికా, రష్యా శుభాకాంక్షలు**

బెలారస్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అమెరికా, రష్యా దేశాలు వేర్వేరు ప్రకటనల్లో బెలారస్ అధ్యక్షుడు లుకాషెంకోకు శుభాకాంక్షలు తెలిపాయి. అమెరికా తరపున బెలారస్‌కు ఆంటోనీ బ్లింకెన్ లేఖ పంపారు. 'అమెరికా తరపున బెలారస్‌కు హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలుపుతున్నా. బెలారస్ వాసులు, బలవంతంగా దేశాన్ని, సొంత వారిని విడిచిపెట్టిన వారందరికీ తమ భవిష్యత్‌ను నిర్ణయించుకునే అవకాశం ఉండాలి. స్వాతంత్ర్య సాధన కోసం జైలుకు వెళ్లిన 1,500 మంది బెలారస్ నాయకుల ధైర్యాన్ని అభినందిస్తున్నాం. బేషరతుగా వారిని విడుదల చేయాలని పిలుపునిస్తున్నాం. బెలారస్ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వానికి సంబంధించిన మార్గాన్ని అనుసరించే వారికి అండగా ఉంటాం' అని బ్లింకెన్ పేర్కొన్నారు. ఇదిలావుంటే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా బెలారస్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, తమ దేశాల స్నేహ బంధాన్ని మరింత పెంచుకోవాలని, పరస్పర సహకార బంధాన్ని పటిష్ఠపర్చుకోవాలని ఆకాంక్షించారు. వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మెరుగుపర్చుకోవాల్సిన అవసరముందని, బాహ్య సవాళ్లను కలిసి అధిగమిద్దామని పుతిన్ పేర్కొన్నారు. నిర్మాణాత్మక ద్వైపాక్షిక సంబంధాలు, వ్యవస్థాగత సహకార బంధాన్ని పటిష్ఠపర్చుకుందామన్నారు.

## అమెరికా అధ్యక్ష రేసులో
# మిషెల్ ఒబామా, కమలా హారిస్!

### బైడెన్ స్థానంలో రంగ ప్రవేశానికి ఏర్పాట్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తుండటంతో ఆ దేశంలో రాజకీయ వేడి పెరుగుతోంది. తాజాగా అధ్యక్షుడు జో బైడెన్, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య జరిగిన డిబేట్ చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ దూకుడు ప్రదర్శించగా బైడెన్ తడబడ్డారు. వయస్సు మీద పడటం, ఆరోగ్య సమస్యలు ఉండటం, కొన్ని విషయాల్లో తగిన విధంగా స్పందించలేకపోతుండటం వల్ల బైడెన్ స్థానంలో వేరొకరిని బరిలోకి దించాలన్న యోచన డెమొక్రాట్లలో ఉంది. సొంత పార్టీ నుంచి బైడెన్‌కు వ్యతిరేకత ఎదురవుతోంది. దీంతో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ ఒబామాను బైడెన్ స్థానంలో డెమొక్రాట్ల తరపున అధ్యక్ష రేసులో నిలబెట్టే ప్రయత్నం జరుగుతున్నట్లు అమెరికా సెనేటర్ టెడ్ క్రూజ్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారి తీశాయి. ఎన్నికలకు మూడు నెలల ముందు అంటే ఆగస్టులో జరిగే డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో బైడెన్‌ను స్థానంలో మిషెల్ ఒబామాను తీసుకు వస్తారని క్రూజ్ తెలిపారు.డెమొక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష రేసులో మరో ఐదుగురు ఉన్నట్లు వార్తలొచ్చాయి. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసన్, మిచిగాన్ గవర్నర్ గ్రెట్చన్ విట్‌మెర్,

బైడెన్ కేబినెట్‌లోని మంత్రి పెటే బుట్టిజియాజ్, సెనేటర్ ఎలిజిబెత్ వారెన్ కూడా పోటీలో ఉంటారని తెలుస్తోంది. నవంబర్ 5న అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి.

**నా తడబాటుకు అదే కారణం: బైడెన్**

తన స్థానంలో వేరొకరిని అధ్యక్ష రేసులో నిలబెట్టేందుకు పార్టీలో ప్రయత్నాలు జరుగుతుండటంతో ట్రంప్‌తో డిబేట్‌లో తన తడబాటుకు కారణం లేకపోలేదంటూ బైడెన్ వివరణ ఇచ్చుకున్నారు. తన సిబ్బంది వద్దని చెప్పినా వినకుండా విదేశీ పర్యటనలు పెట్టుకున్న క్రమంలో అలసట కారణంగా వేదికపై నిద్రావస్థలోకి జారుకున్నానని, ట్రంప్ వాదనలను దీటుగా బదులు ఇవ్వలేకపోయానని బైడెన్ వెల్లడించారు. చురుగ్గా వ్యవహరించలేకపోయినందుకు తన మద్దతుదారులందరికీ ఆయన క్షమాపణలు చెప్పారు.

తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేయడం లేదని, సాకులు చెప్పడం లేదని, వివరణ మాత్రమే ఇస్తున్నానని వర్జీనియాలో జరిగిన ఓ కార్యక్రమంలో బైడెన్ చెప్పుకొచ్చారు. ఇదిలావుంటే ట్రంప్ ముందర బైడెన్ డీలా పడటం వాస్తవమేగానీ ఆయన అధ్యక్షుడిగా అసమర్థుడని భావించడం సరికాదని శ్వేతసౌధం పేర్కొంది. మరో నాలుగేళ్ల పాటు దేశాన్ని సమర్థంగా నడిపించగల సమర్థుడు బైడెన్ అని పేర్కొంది. డిబేట్ రోజు బైడెన్ ఆరోగ్యం సరిగ్గా లేదని, జలుబు, గొంతు నొప్పితో ఆయన బాధపడ్డారని ఓ అధికారి తెలిపారు. బైడెన్ పాలన సమర్థంగా సాగిందని, అన్ని పనులు, బాధ్యతలను సక్రమంగానే నిర్వర్తించారని, ప్రజలకు మెరుగైన సేవలందించారని, ఎక్కడా బాధ్యతల నుంచి వెనక్కి తగ్గలేదన్నారు. డిబేట్ ముఖ్యం కాదని అధ్యక్షుడిగా ఎలా పనిచేయగలరన్నదే ప్రధానమని నొక్కిచెప్పారు.

# ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట

ఇస్లామాబాద్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌తో పాటు ఆయన పార్టీ సీనియర్లకు తోషాఖానా అవినీతికి సంబంధించిన నిరసనల కేసులో ఊరట లభించింది. ఎన్నికల కమిషన్ ఇమ్రాన్ ఖాన్‌పై వేటు వేయడాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించిన నిరసన నేపథ్య కేసులో ఇమ్రాన్ ఖాన్ నిర్దోషి అంటూ కోర్టు తీర్పు వెలువడింది. అలాగే షా మెహమూద్ ఖురేషి, షేక్ రషీద్, అసద్ కైజర్, షెహ్రియర్ అఫ్రిది, ఫైజల్ జావేద్, రాజా ఖుర్రమ్ నవాజ్, అలీ నవాజ్ అవాన్ కూడా నిర్దోషులని జుడిషియల్ మెజిస్ట్రేట్ యాసిర్ మెహమూద్ పేర్కొన్నారు. ఇమ్రాన్ ఖాన్‌ను విడుదల చేయాలని దాఖలైన పిటిషన్లపై తీర్పును న్యాయమూర్తి గత వారంలో రిజర్వులో పెట్టారు. ఆయన బుధవారం ఇమ్రాన్‌కు ఊరట కల్పిస్తూ తీర్పు వెలువరించారు.

**బుష్రా బీబీకి మధ్యంతర బెయిల్**

ఇమ్రాన్ ఖాన్ భార్య బుష్రా బీబీకి అవినీతి కేసులో మధ్యంతర బెయిల్ మంజూరైంది. ఈ మేరకు రావల్పిండిలోని ప్రత్యేక అకౌంటబిలిటీ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అక్రమ లావాదేవీల్లో ఇమ్రాన్‌కు సహకరించినట్లు బుష్రాపై ఆరోపణలు ఉన్న విషయం తెలిసిందే.

## అమరావతి విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

విభజన జరుగుతుందని, ఇక్కడ రాజధాని కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదు. కాని రాష్ట్రానికి ఎటు చూసినా అమరావతి మధ్యలో ఉంటుంది. రాజధానికి రెండు వైపులా 12 చొప్పున పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. విభజన అనంతరం శివరామృష్ణ కమిటీ రాష్ట్రంలో పర్యటిస్తే...కృష్ణా, గుంటూరు లేదా ఆ రెండు జిల్లాల మధ్య రాజధాని ఉండాలని ఎక్కువ మంది తమ అభిప్రాయాలను చెప్పారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా 34,400 ఎకరాలను రైతులు ముందుకొచ్చి ఉచితంగా భూములిచ్చారు. జగన్ కూడా రాజధాని రాష్ట్రం నడిమధ్యలో రాజధాని ఉండాలని అసెంబ్లీలో అన్నారు. నేను ఇల్లు కట్టుకున్నా... మీరు కట్టుకోలేదు అని నన్ను అన్నారు. కానీ తర్వాత ఎలా మాటలు మార్చారో అంతా చూశాం. రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకుతో పాటు ఏఐఐబీ, జెఐసీఏ వంటి సంస్థలు ఆర్థిక తోడ్పాటుకు ముందుకు వచ్చాయి. సింగపూర్ తో ఎంఓయూ కుదుర్చుకున్నాం. దేశంలోనే స్మార్ట్ సిటీగా, ప్రపంచ స్థాయి నగరంగా ఆర్థిక రాజధానిగా అమరావతి విజన్ రూపొందించాం. పరిశ్రమలతో పాటు ఉద్యోగాల కల్పన కేంద్రంగా నిర్ణయించాం. రూ.51,687 కోట్లతో రాజధానులకు అంచనా వేసి రూ.41,170 కోట్లకు టెండర్లు పిలిచాం. అప్పటికి జరిగిన నిర్మాణాలకు గాను రూ.4,318 కోట్లు బిల్లులు చెల్లించాం...రూ.1,268 కోట్లు ఇప్పటికీ పెండింగులో ఉన్నాయని చంద్రబాబు వివరించారు.

జగన్ అధికారంలోకి రాగానే రాజధానిలో అన్ని నిర్మాణాలను మధ్యలోనే నిలిపేశారు. వ్యవసాయ కూలీలకు అందించాల్సిన పెన్షన్లు, రైతులకు ఇవ్వాల్సిన కౌలు నిలిపేశారు. మాస్టర్ ప్లాన్ రద్దు చేశారు. రూ.వెయ్యి కోట్లు గ్రాంట్ రాకుండా కేంద్రానికి తప్పుడు ఫిర్యాదులు చేశారు. సింగపూర్ కన్సార్టియంపైనా ఆరోపణలు చేశారు. 14 ఎకరాల్లో 12 టవర్లతో నిర్మాణం తలపెట్టిన హ్యాపీ నెస్ట్ ను నాశనం చేశారు. రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీశారు. పెట్టుబడి దారుల్లో నమ్మకం సన్నగిల్లింది. సంపద సృష్టి పడిపోయింది. చిన్నపాటి ఉపాధికి కూడా పక్క రాష్ట్రానికి వెళ్లాల్సి వచ్చింది. అన్ని రంగాలు రివర్స్ అయ్యాయి. హైకోర్టు, హెచ్‌ఓడీ, సచివాలయాలకు సంబంధించిన ఐకానిక్ పునాదులన్నీ నీళ్లలో ముంచారు. 2019లో ఎక్కడున్న పనులు ఐదేళ్ల పాటు అక్కడే ఉన్నాయని చంద్రబాబు వెల్లడించారు. గత పాలకులు బూడిద చేసిన ప్రాంతం నుండే బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతాం. ప్రజా రాజధాని ఏ ఒక్కరి కోసమో కాదు. ఉపాధి కల్పన, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన అమరావతి వల్లే సాధ్యం అవుతుంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల వారికి ఉద్యోగాల కల్పన జరుగుతుంది. రాజధాని పునర్నిర్మాణంపై కేంద్ర సహాయంతో ప్రతి తెలుగుబిడ్డ గర్వించే ప్రపంచస్థాయి నగరంగా గత మాస్టర్ ప్లాన్ ప్రకారం నిర్మాణాలు కొనసాగిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## జగన్ కేసులపై రోజువారీ విచారణ

(మొదటిపేజీ తరువాయి)

కావడం... రోజువారీ విచారణకు కేసులు రావడంతో కోర్టుకు జగన్ హాజరు కావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

**నేడు నెల్లూరుకు జగన్**

జగన్ గురువారం నెల్లూరు జిల్లాకు వెళ్లనున్నారు. అక్కడ జిల్లా జైలులో ఉన్న మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఆయన పరామర్శించనున్నారు. ఇటీవల ఎన్నికల సమయంలో నెలకొన్న అల్లర్ల విషయంలో పిన్నెల్లిని పోలీసులు అరెస్టు చేసి నెల్లూరుకు తరలించారు. దీంతో తొలిసారిగా జగన్ తన పర్యటనను నెల్లూరు నుంచి ప్రారంభించనున్నారు. ఆరోజు ఉదయం 9.40 గంటలకు తాడేపల్లి నుంచి హెలీకాప్టర్‌లో బయల్దేరి, 10.30 గంటలకు నెల్లూరు పోలీస్ పెరెడ్ గ్రౌండ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి నెల్లూరు సెంట్రల్ జైలుకు చేరుకుని పిన్నెల్లిని కలుస్తారు. అనంతరం 12 గంటలకు తిరిగి పోలీస్‌పెరెడ్ గ్రౌండ్‌కు జగన్ చేరుకుని, అక్కడి నుంచి తాడేపల్లికి వస్తారు.

## డీఎస్సీలో చేరుస్తారా... తొలగిస్తారా?

(మొదటిపేజీ తరువాయి)

చర్చించాలని మంత్రి ఆదేశించారు. వాటిపై అధికారులు సమగ్ర అధ్యయనం చేసి, వేగవంతంగా మంత్రికి నివేదించనున్నారని తెలిసింది. అనంతరం డీఎస్సీ నోటిఫికేషన్, పరీక్షల షెడ్యూలు రానుంది. అనంతరం ఆందోళనకు దిగిన గిరిజన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులతో గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి భేటీ అయ్యారు. డీఎస్సీతో తమకు అన్యాయం జరుగుతుందంటూ మంత్రి ఎదుట ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డీఎస్సీలో తమ పోస్టులు ప్రకటిస్తే నడిరోడ్డున పడతామని వాపోయారు. దీనిపై స్పందించిన మంత్రి గిరిజన ఉపాధ్యాయులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులను వైసీపీ నేతలు రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ఉద్యోగుల సమస్యల్ని చర్చించలేదని, వారికి తీవ్ర అన్యాయం చేశారని చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీతో గిరిజన పాఠశాలల ఉపాధ్యాయులు కొంత ఊరట చెందారు. మరోవైపు అతి తక్కువగా ఉన్న ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లోని ఎస్జీటీ పోస్టులను పెంచుతారా... అవి లేకుండానే నోటిఫికేషన్ ఇస్తారా అనేదీ చూడాలి. వాస్తవంగా ఈనెల ఒకటో తేదీన డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని అందరూ భావించారు. దీంతో అనంతపురం జిల్లాలో ఎస్జీటీ పోస్టులు పెంచాలని నిరుద్యోగ ఉపాధ్యాయులు ఆందోళన చేశారు. ఇది ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఇప్పుడు తక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్జీటీ పోస్టుల సంఖ్య పెంచకుంటే... మళ్లీ అక్కడ నిరుద్యోగులు రోడ్డెక్కే పరిస్థితులున్నాయి. ఇప్పటికే ఇచ్చిన డీఎస్సీ పోస్టులు అతి తక్కువగా ఉన్నాయని నిరుద్యోగులు అసంతృప్తి చెందుతున్నారు. ఈ తక్కువ పోస్టుల నుంచి మళ్లీ గిరిజన ఉపాధ్యాయ పోస్టులను తొలగిస్తే, వాస్తవ పోస్టులు 15 వేలకే పరిమితమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఆచితూచి వ్యవహరించి, వేగవంతంగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీకి నిమగ్నమైంది. టెట్ నోటిఫికేషన్‌కు నెల రోజుల వ్యవధి ఇచ్చి, ఆ తర్వాత పరీక్షలు నిర్వహించేలా షెడ్యూలుపై అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది.

## మిషన్ భగీరథపై
# మీ నివేదిక బోగస్‌దా?

**విశాలాంధ్ర–హైదరాబాద్:**

మిషన్ భగీరథపై మీరిచ్చిన నాటి నివేదిక బోగస్‌దని భావించాలా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారు లను నిలదీశారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భట్టి మాట్లాడుతూ... భగీరథ పథకం కింద రూ.42 వేల కోట్లు ఖర్చు చేసి రాష్ట్రంలో 1,156 ఆవాసాలకు 50 శాతం నీళ్లు సరఫరా చేస్తున్నామని చెబుతున్నారు. ఇదే పథకం కింద రాష్ట్రంలో అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుందని, నీటి ఎద్దడి లేదని సర్పంచుల సంతకాలతో గతంలో అసెంబ్లీలో ప్రకటించారు. కేంద్రానికీ నివేదిక పంపారు. రాష్ట్రంలో 23,824 ఆవాసాలు ఉండగా 1,156 ఆవాసాల్లో 50 శాతం మాత్రమే నీళ్లు ఇవ్వగలుగుతున్నాం అంటున్నారు. ఆలేరు, భువనగిరి, నల్గొండ నియోజకవర్గాల్లో కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందడం లేదు నిధులు కావాలని మీ శాఖ నుంచే ఫైల్ రావడం ఏమిటని డిప్యూటీ సీఎం మిషన్ భగీరథ అధికారులను ప్రశ్నించారు. అంటే అది తప్పుడు నివేదిక అని భావించాలా అని నిలదీశారు. ఈ పథకం కింద తాగునీటి సరఫరా పై జరుగుతున్న సర్వే, ఎప్పుడు పూర్తవుతుంది తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే పూర్తికాగానే ఎమ్మెల్యేలందరికీ ఆ నివేదికలు అందజేసి... తాగునీరు అందుతుందన్న విషయాన్ని నిర్ధారణ చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రూ.42 వేల కోట్లు ఖర్చు చేసిన ఇంకా తాగునీటి ఎద్దడి ఉందని కొత్తగూడెం, ఆలేరు నియోజకవర్గాల్లో అదనపు నిధులు కోరుతున్నారు... ఇదేమిటి అని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని మున్సిపాలిటీలకు హైదరాబాద్ మెట్రో నుంచి తాగునీటిని సరఫరా చేస్తుండగా ఆయా మున్సిపాలిటీలు మిషన్ భగీరథ కింద మంచినీటిని సరఫరా చేస్తున్నట్టు రికార్డుల్లో ఎందుకు చూపిస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. తాగునీటి సరఫరాకు ప్రధాన సోర్స్‌ను సమీపంలో నుంచి తీసుకోవాలని సూచించారు.

## రాజ్యసభ నుంచి
# విపక్షాల వాకౌట్

**న్యూఢిల్లీ:**

'అబద్ధాలు ఆపండి, ప్రతిపక్ష నేతను మాట్లాడనివ్వండి' అన్న నినాదాలతో రాజ్యసభ దద్దరిల్లింది. ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రతి పక్షాలు బహిష్కరించాయి. కాంగ్రెస్‌పై విమర్శల దాడిని తీవ్రంగా ఖండించాయి. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానంపై కృతజ్ఞతా తీర్మానానికి స్పందిస్తూ గత కాంగ్రెస్ పాలన, ఎమర్జెన్సీ, మాజీ అధినేత్రి సోనియాగాంధీపై మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దీంతో మోదీ ప్రసంగానికి వ్యతిరేకంగా ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు నినాదాలి చ్చారు. ప్రధాని తన తీరు మార్చుకోకుండా విమర్శల వర్షాన్ని కురిపించడంతో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖడ్గేను జోక్యం చేసుకునేందుకు అవకాశమివ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. 'ఎల్‌ఓపీని మాట్లాడనివ్వండి' అని ఎంపీలు నినాదాలు చేశారు. ఖడ్గే కూడా తనను మాట్లాడనివ్వాలని చైర్మన్‌ను కోరారు. 'మా అభిప్రాయాన్ని చెప్పనివ్వండి' అని అన్నారు. కానీ సభాపతి ఒప్పుకోలేదు. దీంతో 'అబద్ధాలు చెప్పడం ఆపండి. సిగ్గు సిగ్గు' అంటూ మోదీని ఉద్దేశించి ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు నినదించారు. సభలో గందరగోళం నెలకొన్నా మోదీ మాట్లాడటం ఆపలేదు. ఖడ్గేకు మాట్లాడే అవకాశాన్ని సభాపతి ఇవ్వలేదు. దీంతో 'ఇండియా' ఎంపీలంతా వాకౌట్ చేశారు. బీజేపీ మిత్రపక్షమైన బీజేడీ కూడా మద్దతిచ్చింది. అంతకుముందు మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్‌ను పరాన్నజీవితో పోల్చారు. మిత్రపక్షాలను మింగేస్తుందని ఆరోపించారు. మణిపూర్ అంశాన్ని రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మాజీ అధినేత్రి సోనియాగాంధీని విమర్శించారు. కాంగ్రెస్ అధ్వర్యంలో రిమోట్ కంట్రోల్ పాలన సాగిందని వ్యాఖ్యానించారు. 'దేశం దానంతత అదే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిపోందని నమ్మే మేధావులు కొందరు ఇక్కడ ఉన్నారు. వీరు గతంలో ఆటో పైలట్/ రిమోట్–పైలట్ ప్రభుత్వాలు నడిపారు' అని విమర్శించారు. కాంగ్రెస్‌తో రాజ్యాంగానికి అతిపెద్ద ముప్పు అన్నారు. గతం గతహా అని ఎమెర్జెన్సీ ఉద్దేశించి కాంగ్రెస్ అంటోందని కానీ ఆ పార్టీ చేసిన పాపాలు... కాలంతో పాటు తుడిచిపెట్టుకుపోయాయా అని మోదీ వ్యాఖ్యానించారు. తప్పు జరిగిన ప్రతిసారీ కాంగ్రెస్‌లోని దళితుడు లేక ఓబీసీపై దాని ప్రభావం ఉంటుందన్నారు. లోక్‌సభ స్పీకర్ ఎన్నికల్లో ఓడిపోతారని తెలిసికూడా 2017లో మీరా కుమార్‌ను నిలబెట్టిందని విమర్శించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, తొలి దళిత మహిళ రాష్ట్రపతిని కాంగ్రెస్ విమర్శించిందని మోదీ ఆరోపించారు.

## జార్ఖండ్ పీఠంపై హేమంత్ సోరెన్?

(మొదటిపేజీ తరువాయి)

ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. అంతకుముందు చంపై సోరెన్ నివాసంలో సమావేశమైన జేఎంఎం సారథ్యంలోని కూటమి ఎమ్మెల్యేలంతా హేమంత్ సోరెన్‌ను సభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో హేమంత్ కొత్త సీఎంగా పగ్గాలు చేపట్టేందుకు వీలుగా ప్రస్తుత సీఎం చంపై సోరెన్ తన రాజీనామాను గవర్నర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ భవన్ వద్ద చంపై సోరెన్ మాట్లాడుతూ జేఎంఎం కూటమి తీసుకున్న నిర్ణయం మేరకు రాజీనామా చేసినట్లు తెలిపారు. తమ కూటమి బలంగా ఉందన్నారు. 'హేమంత్ విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. సంకీర్ణ భాగస్వామ్య పక్షాలు నాకు బాధ్యతలు అప్పగించాయి. ఇప్పుడు కూటమి హేమంత్ సోరెన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది' అని తెలిపారు. మరోవైపు, ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని గవర్నర్‌ను హేమంత్ సోరెన్ కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'సీఎం (చంపై సోరెన్) మీకు అన్నీ చెప్పారు. మీకు అన్నీ వివరంగా చెబుతాం. అన్ని విధానాలను అనుసరించాం' అని తెలిపారు. ఐదు నెలల తర్వాత జైలు నుంచి విడుదలైన ఆయన తాను కుట్రకు గురైనట్లు చెప్పారు. 'నన్ను తప్పుగా ఇరికించారు. నాపై కుట్ర పన్నారు. నేను ఐదు నెలలు జైలులో ఉండవలసి వచ్చింది. నేను న్యాయవ్యవస్థను గౌరవిస్తాను. న్యాయస్థానం తన ఉత్తర్వును జారీ చేసింది. నేను (బెయిల్‌పై) బయట ఉన్నాను. కానీ న్యాయ ప్రక్రియ సుదీర్ఘమైనది' అని తెలిపారు. కాగా, చంపై సోరెన్ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. గురువారం జార్ఖండ్ ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఈ పరిణామాన్ని జేఎంఎం అధికార ప్రతినిధి సుప్రియో భట్టాచార్య ధ్రువీకరించారు. భూ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో హైకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో దాదాపు ఐదు నెలల తర్వాత హేమంత్ సోరెన్ జూన్ 28న జైలు నుంచి విడుదలయ్యారు. జనవరి 31న అరెస్టు కావడానికి ముందు ఆయన సీఎం పదవికి రాజీనామా చేశారు.

హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేస్తే, నవంబరు 15, 2000న బీహార్ నుంచి ఏర్పాటయిన జార్ఖండ్ రాష్ట్రానికి 13వ ముఖ్యమంత్రి అవుతారు. బుధవారం జరిగిన కూటమి సమావేశానికి హేమంత్ సోరెన్ సోదరుడు బసంత్, భార్య కల్పనతో పాటు కాంగ్రెస్ జార్ఖండ్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్ కూడా హాజరయ్యారు. ఇదిలాఉండగా, ఈ

పరిణామాలపై బీజేపీ నాయకుడు నిష్కాంత్ దూబె 'ఎక్స్' లో చేసిన పోస్ట్‌లో, 'జార్ఖండ్‌లో చంపై సోరెన్ శకం ముగిసింది. కుటుంబ ఆధారిత పార్టీలో కుటుంబానికి వెలుపల ఉన్న వ్యక్తులకు రాజకీయ భవిష్యత్తు లేదు. ముఖ్యమంత్రి... భగవాన్ బిర్సా ముండా నుంచి స్ఫూర్తి పొంది అవినీతిపరుడైన హేమంత్ సోరెన్ జీకి వ్యతిరేకంగా నిలబడాలని కోరుకుంటున్నాను' అని పేర్కొన్నారు. శిబూ సోరెన్ కుటుంబానికి వెలుపల ఉన్న గిరిజనులు జేఎంఎంలో తాత్కాలిక ముఖాలు మాత్రమేనని బీజేపీ జార్ఖండ్ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ నొక్కి చెప్పారు. ఆ కుటుంబం ప్రజలను వారి అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకుంటుందని ఆరోపించారు. రాజకీయ వర్గాల్లో 'కొల్హాన్ పులి' గా పిలిచే చంపై సోరెన్ నేడు ఎలుకగా మారిందని ఆయన పేర్కొన్నారు. జార్ఖండ్‌లో 12 మంది మంత్రులు ఉండగా, రాష్ట్ర మంత్రివర్గంలో ప్రస్తుతం 10 మంది మంత్రులు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత, రాష్ట్రంలో జేఎంఎం నేతృత్వంలోని కూటమి బలం 45 మంది ఎమ్మెల్యేలకు తగ్గింది. జేఎంఎంకు 27, కాంగ్రెస్ 17, ఆర్‌జేడీకి 1 ఎమ్మెల్యే ఉన్నారు. ఇద్దరు జేఎంఎం ఎమ్మెల్యేలు నళిని సోరెన్, జోబా మాఝీ ఇప్పుడు పార్లమెంటు సభ్యులు కాగా, జామా శాసనసభ్యురాలు సీతా సోరెన్ బీజేపీ టికెట్‌పై సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయడానికి రాజీనామా చేశారు. జేఎంఎం మరో ఇద్దరు శాసనసభ్యులను... బిషున్‌పూర్ ఎమ్మెల్యే చమ్రా లిండా, బోరియో ఎమ్మెల్యే లోబిన్ హెంబ్రోమ్‌ను పార్టీ నుంచి బహిష్కరించింది. అదేవిధంగా అసెంబ్లీలో బీజేపీ బలం 24 కు తగ్గింది. దాని ఇద్దరు ఎమ్మెల్యేలు ధులు మహతో (బగ్మారా), మనీశ్ జైస్వాల్ (హజారీబాగ్) ఇప్పుడు ఎంపీలుగా ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో చేరిన మండు ఎమ్మెల్యే జైప్రకాశ్ భాయ్ పటేల్‌ను కాషాయ పార్టీ బహిష్కరించింది. 81 మంది సభ్యులున్న జార్ఖండ్ అసెంబ్లీలో ప్రస్తుత బలం 76.

# ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

- సీపీఐకి జనాదరణ
- పాల్వంచలో 100 కుటుంబాల చేరిక: కూనంనేని

**విశాలాంధ్ర బ్యూరో–భద్రాద్రి కొత్తగూడెం:**

నియోజకవర్గంలో సీపీఐకు జనాదరణ పెరుగుతోందని, దీంతో పూర్వ వైభవం వైపు పయనిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచలో పాలకొయ్య తండాకు చెందిన వంద కుటుంబాలు శేషగిరిభవన్‌లో బుధవారం కూనంనేని సమక్షంలో సీపీఐలో చేరాయి. పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కూనవనేని మాట్లాడుతూ... సమస్యలు పరిష్కరిస్తున్న నేపథ్యంలోనే సీపీఐను ప్రజలు ఆదరిస్తున్నారని చెప్పారు. జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా ప్రాథమిక సభ్యత్వాన్ని అందజేశారు. కూనంనేని మాట్లాడుతూ పార్టీ విస్తరణ, ప్రజా సమస్యల పరిస్కారమే అంతిమ లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల నమ్మకానికి, ఆశలకు అనుగుణంగా ప్రతి పల్లెకు మౌలిక వసతులు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు వివరించారు. పాలకొయ్యతండాకు చెందిన నూనావత్ శంకర్, వీరాస్వామి, చంటి, సేవాలాల్, శ్రీరామ్, సుశీల, నరసింహ నేతృత్వంలో వంద కుటుంబాలు చేరినట్లు ప్రకటించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా సమితి సభ్యుడు అడుసుమిల్లి సాయిబాబు, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, గెద్దాడు నగేశ్, రత్నకుమారి, భూక్యా శ్రీనివాస్, బరిగేల సంపూర్ణ, ఎన్ రమేశ్ పాల్గొన్నారు.

## మళ్లీ ఉచిత ఇసుక

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకాల విధానం ఎలా ఉంది. ఎవరు లబ్ధి పొందారు. ప్రభుత్వానికి జరిగిన నష్టం... పేదలు, గృహ నిర్మాణ రంగానికి జరిగిన నష్టమెంతో అంచనా వేస్తూ ఒక నివేదిక సిద్ధం చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

**నిర్మాణ రంగాన్ని పునరుద్ధరిస్తాం: మంత్రి రవీంద్ర**

రానున్న మూడు మాసాల్లో ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చి ఉచితంగా ఇసుకను అందరికీ అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం సీఎంతో సమీక్ష అనంతరం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అమలులోకి తేవడం ద్వారా నిర్మాణ రంగాన్ని పునరుద్ధరించి, ఆ రంగంపై ఆధారపడిన కార్మికులు అందరికీ పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలనే దృఢ సంకల్పంతో సీఎం చంద్రబాబు ఉన్నారని తెలిపారు. ఇందుకోసం రానున్న మూడు మాసాల్లో మార్గదర్శకాలను రూపొందించి పటిష్టమైన ఉచిత ఇసుక విధానాన్ని రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం అనుసరించిన ఇసుక విధానం వల్ల రాష్ట్రంలో నిర్మాణ రంగమంతా కుదేలైందని, ఆ రంగంపై ఆధారపడిన 40 రంగాల కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు గత ప్రభుత్వం ఇసుకను అమ్ముకోవడం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకునే అంశంపైనే దృష్టి సారించిందని, ఫలితంగా కోట్లాది మంది కార్మికులు ఎంతగానో నష్టపోయా రన్నారు. అటువంటి పరిస్థితులు రాష్ట్రంలో పునరావృతం కాకుండా ఉచితంగా ఇసుకను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చి నిరంతరాయంగా నిర్మాణ రంగం కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన ఇసుక విధానాన్ని నిలుపుదల చేయడంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం అయినందున సెప్టెంబరు లోపు రీచ్‌ల నుంచి ఇసుక తవ్వకాలకు వీలుండదన్నారు. రానున్న పక్షం రోజుల్లో రాష్ట్రంలో అధికారికంగా, అనధికారి కంగా ఉన్న ఇసుక స్టాక్ పాయింట్లను గుర్తించి వాటిల్లో అందుబాటులో ఉన్న ఇసుకను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రానున్న మూడు మాసాల పాటు దాదాపు కోటి టన్నుల ఇసుక అవసరం అవుతుందని అంచనా వేశామ న్నారు. స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక రవాణా చేసే వాహనాల చార్జీలను కూడా నియంత్రించి అతి తక్కువ చార్జీలకే ఇసుక రవాణా అయ్యే విధంగా, ఇసుక బ్లాక్ మార్కెటింగ్ నివారణకు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

# పాత పంటల బీమా అమలుకు చర్యలు

## రైతుల ఇబ్బందులు ఐఏఎస్‌లు తెలుసుకోవాలి – సీఎం చంద్రబాబు

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** రైతులకు పాత పంటల బీమా విధానం అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రైతు భాగస్వామ్యంతో ఇక పంటల బీమా విధానం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఖరీఫ్ ప్రణాళిక, పంటలకు నీటి విడుదల అంశాలపై వ్యవసాయ, జలవనరుల శాఖ అధికారులతో సీఎం బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి వనరులను సక్రమంగా నిర్వహించి సాగునీటి కొరత అనేది లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు సాగునీటి విడుదల ప్రణాళికను సీఎంకు వివరించారు. గోదావరి డెల్టాకు జూన 1 నీరు విడుదల చేశామని... ఈ రోజు పట్టిసీమ, పుష్కర, తాటిపూడి, పురుషోత్తం పట్నం ద్వారా నీటి విడుదల మొదలుపెట్టినట్లు తెలిపారు. పులిచింతలలో నీటి లభ్యత లేదని, పట్టిసీమ ద్వారా వచ్చే నీటి ద్వారానే కృష్ణా డెల్టాకు సాగునీరు ఇస్తామన్నారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 4,14,490 లక్షల ఎకరాల సాగు జరగాల్సి ఉండగా 3,04,604 ఎకరాల సాగు జరిగిందని తెలిపారు. అనంతరం సీఎం అధికారులకు అనేక సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. గత 5 ఏళ్లలో ప్రభుత్వ విధానాల కారణంగా సాగు భారంగా మారిపోయిందన్నారు. ప్రాజెక్టుల నిర్వహణను గాలికి వదిలేశారని... కనీసం గేట్లకు గ్రీజు కూడా రాయలేదన్నారు. ఈ మొత్తం పరిస్థితి మారాలని, ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిర్వహణలో మళ్లీ ఉత్తమ విధానాలు అమలు చేయాలని సీఎం ఆదేశించారు. నాడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీరో బడ్జెట్ నాచురల్ ఫార్మింగ్ ను మూలనపడేశారని... మళ్లీ రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలని సూచించారు. పంట కాలువల్లో ఐదేళ్లుగా పూడిక కూడా తీయని దుస్థితి నెలకొందని, తక్షణమే అన్ని పంట కాలువల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృష్ణా నది నీటిని రాయలసీమకు ఎక్కువగా ఉపయోగించి, వృధాగా పోయే గోదావరి వరద నీటిని సద్వినియోగం చేసుకుని కృష్ణా డెల్టాకు నీరు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఐఏఎస్ అధికారులు సైతం సచివాలయం నుంచి పొలాలకు వెళ్లాలని, రైతులతో నేరుగా మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్ష**

సీజనల్ వ్యాధులపై సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. వైద్య ఆరోగ్య శాఖతో పాటు మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు హాజరయ్యారు. సీజనల్ వ్యాధుల విషయంలో ముందు నుంచే అధికారులు చర్యలు తీసుకోవాలని, వ్యాధులు ప్రబలిన తర్వాత చర్యలకు దిగితే పూర్తి ఫలితాలు రావన్నారు. ఆయా శాఖల్లో 2014 నుంచి 2019 వరకు నాటి టీడీపీ పాలనలో అనుసరించిన ఉత్తమ విధానాలు అన్నీ మళ్లీ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్రంలో 60 డయేరియా కేసులు నమోదయ్యాయని. ప్రస్తుతం 6 గ్రామాల్లో 35 డయేరియా యాక్టివ్ కేసులు ఉండగా, ఈ సీజన్‌లో 9 మంది డయేరియాతో చనిపోయారని అధికారులు సీఎంకు వివరించారు. కలుషిత తాగునీరు వల్లే వీరంతా డయేరియా బారిన పడి చనిపోయారని అధికారులు తెలిపారు. దీనిపై సీఎం మాట్లాడుతూ సురక్షితమైన తాగునీరు, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల బారిన పడే వారి సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉన్నందున వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, సత్యకుమార్ యాదవ్, మూడు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 100 రోజుల కార్యాచరణ...

### 3 నెలల్లో 1.28 లక్షల గృహాల పూర్తికి లక్ష్యం

### గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** రాష్ట్రంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద వచ్చే మూడు నెలల్లో లక్షా 28వేల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కె.పార్థసారథి వెల్లడించారు.ఈ మేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖపై అన్ని జిల్లాల ప్రాజెక్టు సంచాలకులు, ఎస్‌ఈఈలు ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు. అనంతరం రాష్ట్ర సచివాలయం నాల్గవ భవనంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా గృహ నిర్మాణ శాఖకు సంబంధించి 100 రోజుల కార్యాచరణ కింద రానున్న మూడు నెలల్లో 1.28 లక్షల గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు పునరుద్ఘాటించారు. ఇందుకు రూ.2వేల 520 కోట్లను ఖర్చు చేయనున్నట్లు వివరించారు. వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న 8.02 లక్షల గృహాలను వచ్చే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. నిర్మాణ దశలో ఉన్న 6.08 లక్షల గృహాల స్టేజ్ కన్వర్షన్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. గృహ నిర్మాణాలు జరిగే లేఅవుట్ల అభివృద్ధికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ, నెల్లూరు, రాయలసీమల్లోని థర్మల్ పవర్ స్టేషన్ల నుంచి వచ్చే ఫ్లై యాష్ వినియోగానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు జరిగిన గృహ నిర్మాణశాఖ సమీక్షలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ, అర్హులైన పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని, ఆ దిశగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా 2015లో ప్రారంభమైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన,(అర్బన్) పథకం క్రింద జిల్లాల్లో గృహ నిర్మాణాల ప్రగతిని, రాష్ట్ర వ్యాప్తంగా గృహ నిర్మాణాల వంద రోజుల ప్రణాళికపై నియోజక వర్గాల వారీగా మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ప్రత్యేక కార్యదర్శి మైదీన్ దివాన్, ఎండీ గిరీషా, పీడీలు పాల్గొన్నారు.

## సముద్రపు కోతకు శాశ్వత పరిష్కారం

### అధికారులతో కలిసి ఉప ముఖ్యమంత్రి ఉప్పాడ తీర ప్రాంతం పరిశీలన

**విశాలాంధ్ర బ్యూరో–కాకినాడ:** ఉప్పాడ సముద్రపు కోత సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు గురైన ప్రాంతాన్ని బుధవారం ఆయన అధికారులతో కలిసి సందర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే క్రమంలో భాగంగా తీర ప్రాంత గ్రామాలను సముద్రపు కోత నుంచి కాపాడేలా కార్యాచరణకు దిగారు. మారీ టైమ్ బోర్డు, కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వ శాఖ(ఎర్త్ సైన్స్ మినిస్ట్రి) అధికారులు, రెవెన్యూ అధికారులతో చర్చించారు. సముద్రపు కోతకు గల కారణాలు, నివారణోపాయాలు వారిని అడిగి తెలుసుకున్నారు. ఉప్పాడ తీరంలోనే సముద్రం ఎందుకు ముందుకు వస్తోందో కారణాలు, తీరాన్ని కోతకు గురి కాకుండా చేయాల్సిన మార్గాలు అన్వేషించాలని సూచించారు. ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని, దీనిపై శాస్త్రీయంగా సర్వే నిర్వహించి పనులు మొదలు పెడదామని చెప్పారు. ఉప్పాడ గ్రామ తీర ప్రాంతంలో మొత్తం 84 ఎకరాల విస్తీర్ణం భూమి సముద్రంలో కలిసిపోయిందని జిల్లా సర్వేయర్ లక్ష్మీ నారాయణ తెలిపారు. 60 ఎకరాలు కోతకు గురయ్యాక సర్వే ప్రారంభించినట్టు చెప్పారు. ఆ తదనంతరం మరో 20 ఎకరాలు సముద్రంలో కలిసిపోయిన విషయాన్ని వివరించారు. యు కొత్తపల్లి మండల పరిధిలోని ఎనిమిది తీర ప్రాంత గ్రామాల్లో 1,360 ఎకరాలు కోతకు గురైన విషయాన్ని తెలుసుకుని పవన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సముద్రపు కోతపై పూర్తి స్థాయిలో అధ్యయనం జరపాలని చెన్నై నుంచి ఉప్పాడ తీర ప్రాంత కోతపై పరిశోధన జరిపేందుకు వచ్చిన కేంద్ర ఖగోళశాస్త్ర మంత్రిత్వశాఖ అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, టీడీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వర్మ, జనసేన సమన్వయకర్త మరెడ్డి శ్రీనివాస్, బీజేపీ ఇన్‌ఛార్జి కృష్ణంరాజు, జనసేననేత వేములపాటి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

**పూలతో స్వాగతం:**

ఉప్పాడ తీర ప్రాంత కోత సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అధికారులతో కలసి అధ్యయనానికి వచ్చిన పవన్ కల్యాణ్‌కు ఉప్పాడ, తీర ప్రాంత గ్రామాల ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. మత్స్యకార మహిళలు పూల వర్షం కురిపించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

## విశాఖలో బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘంతో ఏఐటీయూసీ నేతల భేటీ

**విశాలాంధ్ర–విజయవాడ:** విశాఖలో బ్యాంకు విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలతో ఏఐటీయూసీ నాయకులు బుధవారం భేటీ అయ్యారు. వివిధ అంశాలపై చర్చించారు. సెప్టెంబరులో ఏఐటీయూసీ జనరల్ కౌన్సిల్ జరగనున్న క్రమంలో ఈ సమావేశం జరిగిందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు తెలిపారు. సమావేశంలో ఏపీబీఈఎఫ్ మాజీ అధ్యక్షుడు ఎ.కోటేశ్వరరావు, ఏపీబీఆర్ఎఫ్ కార్యనిర్వహణ కార్యదర్శి ఐ.కేశవరావు, ఉద్యోగుల సంఘం నాయకులు రవి కుమార్, పి.పాండు రంగారావు, జి.రామచంద్రరావు మృత్యుంజయరావు, శ్రీమన్నారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, కోశాధికారి కొండలరావు పాల్గొన్నారన్నారు.

## గ్రూప్ 2 మెయిన్స్ వాయిదా : ఏపీపీఎస్సీ

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** గ్రూప్ 2 మెయిన్స్ (జనరల్ రిక్రూట్‌మెంట్) పరీక్షలను ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) వాయిదా వేసింది. ఈ మేరకు ఏపీపీఎస్సీ బుధవారం వెల్లడించింది. గ్రూప్ 2 సర్వీసెస్ (నోటిఫికేషన్ నంబరు 11/2023) ను గత ప్రభుత్వ హయాంలో 7న డిసెంబరు 2023న ప్రకటించారు. అనంతరం గ్రూప్ 2 స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించి మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈనెల 28వ తేదీన పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేసింది. పరిపాలనా కారణాల రీత్యా వాయిదా వేసినట్లు కమిషన్ తెలిపింది. గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షల షెడ్యూలును తర్వాత ప్రకటిస్తారు. గ్రూప్ 2లో మొత్తం ఎగ్జిక్యూటివ్ పోస్టులు 331, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు 556 ఉన్నాయి.

## పేదలకు అమరావతిలో భూములు ఇవ్వలేదేం?

### చంద్రబాబు శ్వేతపత్రంపై ఆదిమూలపు సురేశ్

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** అమరావతిలో పేదలకు భూములు ఎందుకు ఇవ్వలేకపోయారో సీఎం చంద్రబాబు చెప్పాలని మాజీ మంత్రి ఆదిమూలపు సురేశ్ డిమాండ్ చేశారు. రాజధానిగా అమరావతిపై విడుదల చేసిన శ్వేతపత్రం రాజకీయ కోణంలో ఉందని అన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సురేశ్ బుధవారం విలేకరులతో మాట్లాడుతూ అమరావతి కోసం చేసిన ఖర్చు ఎంతని చంద్రబాబును ప్రశ్నించారు. చేసిన అప్పులనూ శ్వేతపత్రంలో పొందుపరిస్తే బాగుండేదన్నారు. సంపద సృష్టిస్తాననే చంద్రబాబు...ఆ సంపదను ఎవరి కోసం సృష్టిస్తారో కూడా చెప్పాలంటూ ఆదిమూలపు సురేశ్ నిలదీశారు. నాడు చంద్రబాబు చేసిన అప్పులన్నీ వైసీపీ ప్రభుత్వం తీర్చిందని, తమ పార్టీ ఐదేళ్ల పాలనలో అమరావతిలో రోడ్లు, భవనాల నిర్మాణాలలో పురోగతి జరిగిందని తెలిపారు. రాజధాని ప్రాంతంలో తొమ్మిది సిటీలను లక్షల కోట్లతో నిర్మిస్తాననడంపై సురేశ్ అభ్యంతరం వ్యక్తంచేశారు. అన్ని లక్షల రూపాయలను ఒకే చోట ఖర్చు పెడితే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అమరావతిలో రాజధాని నిర్మిస్తామన్న చంద్రబాబు.. రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. రాజధాని ప్రకటన జరిగేలోపు అమరావతిలో భారీ భూ కుంభకోణం జరిగిందని, 2014 జూన్- డిసెంబరులో వేలాది ఎకరాలు చేతులు మారాయని తెలిపారు. ఇది ఎలా జరిగిందో ప్రజలకు చంద్రబాబు చెప్పాలని సురేశ్ డిమాండ్ చేశారు. వైసీపీ హయాంలో వీధిదీపాలు ఏర్పాటు చేశామని, రాజ ధానిలో 1400 ఎకరాలను కేటాయించి 52వేల మంది పేదలకు పట్టాలిచ్చామని గుర్తుచేశారు. ఈ అంశాలను శ్వేతపత్రంలో ఎందుకు ప్రస్తావించలేదని చంద్రబాబును నిలదీశారు. వైసీపీ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేశారని ఆదిమూలపు సురేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గంజాయి నియంత్రణకు మంత్రుల ఉప సంఘం

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు మంత్రుల ఉప సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన ఏర్పాటైన ఈ మంత్రుల ఉపసంఘంలో మానవవనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సభ్యులుగా ఉన్నారు. ఉప సంఘం తొలి సమావేశం 4వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాక్ మొదటి అంతస్తులో జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర డీజీపీ, సీఐడీ, ఇంటెలిజెన్సు అదనపు డీజీలు, సెబ్ డైరెక్టర్ పాల్గొంటారు. రాష్ట్రంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రుల ఉప సంఘం చర్చించనుంది.

## 6న ఉచిత యాంటీ రేబీస్ టీకాలు

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఈ నెల ఆరోతేదీన పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కుక్కలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలు వేయనున్నామని ఆ శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్.అమరేంద్ర కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పశువైద్యశాలలో, ప్రాంతీయ పశు వైద్యశాలలో, వెటర్నరీ పోలి క్లినిక్‌లు, వెటర్నరీ సూపర్ స్పెషాల్టీ హాస్పిటళ్ల వద్ద ఉచితంగా టీకాలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల 70 వేల యాంటీ రేబీస్ టీకాలు సిద్ధం చేశామన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1962నుగాని, దగ్గరలోని పశువైద్యశాలలోగాని సంప్రదించాలని పశు పోషకులకు, రైతులకు, ప్రజలకు సూచించారు. ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్... కుక్కకాటు బారిన పడిన ఒక పిల్లవాడికి టీకా మందు ఇచ్చి బతికించిన రోజు కావడంతో ప్రపంచవ్యాప్తంగా జూనోసిస్ దినోత్సవంగా జరుపుకుం టామని గుర్తుచేశారు. దాదాపు180 రకాలకు పైబడిన వ్యాధులు పశుపక్ష్యాదుల నుంచి మనుషులకు సంక్రమిస్తాయని తెలిపారు. వారికి రేబిస్, ఆంత్రాక్స్, బ్రుసుల్లోసిస్, క్షయ మొదలైన వ్యాధులు వచ్చే అవకాశముం దన్నారు. ఇందులో రేబిస్ చాలా ప్రమాదకరమైన, ప్రాణాంతకమైన వ్యాధి అని తెలిపారు. పశువుల పెంపకం దారులు, రైతులు, ప్రజలు జూనోటిక్ వ్యాధులపై అవగాహన పెంచుకొని, నివారణ చర్యలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అమరేంద్ర కుమార్ కోరారు.

### మల్లవల్లి, వీరపనేని గూడెంను

## అతిపెద్ద పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతాం

### రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

**విశాలాంధ్ర–గన్నవరం:** మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామిక వాడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బుధవారం గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి గన్నవరం మండలం మల్లవల్లి, బాపులపాడు మండలం వీరపనేని గూడెం పారిశ్రామిక వాడలను సందర్శించి పారిశ్రామికవేత్తలతో మంత్రి సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈ రెండు పారిశ్రామిక వాడల్లో విద్యుత్ కోతల వల్ల ఆయా పరిశ్రమల్లో ఉత్పత్తికి ఆటంకం కలుగుతున్నదని, తద్వారా నష్టం వాటిల్లుతున్నదని పారిశ్రామికవేత్తలు మంత్రికి వివరించారు. వెంటనే మంత్రి విద్యుత్ అధికారులను పిలిచి సమస్య కారణాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ స్టేషన్‌లో సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని, విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ సమస్య పునరావృతం కారాదని హెచ్చరించారు. పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా చాలా ముఖ్యమని పారిశ్రామికవేత్తగా పరిశ్రమ దారుల సమస్యలు తనకు తెలుసని అన్నారు. అశోక్ లేలాండ్ వంటి పెద్ద పారిశ్రామిక బ్రాండెడ్ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. పారిశ్రామి వాడలలో బస్సు షెల్టర్, పోలీస్ పికెట్ వంటి కనీస వసతులు లేకపోవడం శోచనీయమని, వెంటనే ఏర్పాటు చేయాలని పారిశ్రామికవేత్తలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఏపీని అభివృద్ధి రోల్ మోడల్‌గా చేయాలన్నది ముఖ్యమంత్రి సంకల్పమని తెలిపారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ పారిశ్రామిక వాడల్లో భూ సమస్యలు, కనీస వసతుల కల్పన, తదితర అంశాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మంత్రి, శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ అశోక్ లేలాండ్ ప్రతినిధులతో కలిసి అశోక్ లేలాండ్ లేబొట్ సందర్శించారు. గుడివాడ ఆర్డీవో పి.పద్మావతి, ఏపీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వివేక్, జోనల్ మేనేజర్ సీతారాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్ వెంకట్రావు, అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ జయంతికి రండి

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో బుధవారం కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల భేటీ అయ్యారు. కర్నాటకలో శివకుమార్‌ను కలిసి ఈనెల ఎనిమిదో తేదీన విజయవాడలో నిర్వహించనున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతికి రావాలని ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏపీలో కాంగ్రెస్ బలోపేతంపై వారిద్దరి మధ్య చర్చ జరిగింది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డిని షర్మిల మర్యాద పూర్వకంగా కలిసి, రాజశేఖర్‌రెడ్డి జయంతికి రావాలని ఆహ్వానించారు. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, ఇతర మంత్రులను షర్మిల కలిశారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయం అనంతరం షర్మిల వెనక్కి తగ్గకుండా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టారు. రాబోయే ఎన్నికల నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలీయమైన శక్తిగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ అధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

# సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

- పట్టిసీమ రాష్ట్రానికి బంగారుసీమ
- ప్రతి ఎకరాకు సాగు... ప్రతి పల్లెకు తాగునీరు
- నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం
- ఒకేసారి 4 ఎత్తిపోతల ద్వారా నీరు విడుదల చారిత్రాత్మకం: మంత్రి నిమ్మల

**పోలవరం–విశాలాంధ్ర:** పట్టిసీమ రాష్ట్రానికి బంగారు సీమ అని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. టీడీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, ఆ క్రమంలో రాష్ట్రంలో అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. పట్టిసీమ ఎత్తిపోతలలోని రెండు, నాలుగు, ఆరు పంపుల ద్వారా గోదావరి జలాలను బుధవారం ఉదయం మంత్రి విడుదల చేశారు. తొలుత యంత్రాల వద్ద కలెక్టర్ కె.వెట్రి సెల్వి, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, పత్సమట్ల ధర్మరాజులతో కలిసి మంత్రి పూజలు చేశారు. అనంతరం నీరు విడుదల చేసి గోదారమ్మకు హారతులు ఇచ్చారు. నిమ్మల మాట్లాడుతూ ఏటా వేలాది టీఎంసీల గోదావరి వరద నీరు వృధాగా సముద్రంలోకి పోతుందన్నారు. పోలవరం పూర్తి అయ్యేలోగా దానిలో కొంతమేరైనా సాగు, తాగునీటికి వినియోగించేందుకు సీఎం చంద్రబాబు 2014లో నదుల అనుసంధానం లో భాగంగా పట్టిసీమ ఎత్తిపోతల పథక ప్రణాళిక చేశారన్నారు. దీని ద్వారా 2016, 17, 18 సంవత్సరాల్లో ఏటా పది లక్షల ఎకరాలకు సాగు నీరు అందించామని చెప్పారు. రూ.40 వేల కోట్ల విలువైన పంటను పండించి, సంపద సృష్టించారని, ఇది సీఎం దూర దృష్టికి నిదర్శనమన్నారు. దేశంలోనే నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టిన మొదటి వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించడం ద్వారా ముందస్తు ఖరీఫ్ సాగుకు రైతులకు అవకాశం ఉంటుందన్నారు. కృష్ణా జలాలను అటు రాయలసీమకు వినియోగించడం జరుగుతుందన్నారు. చంద్రబాబు చొరవ కారణంగానే పోలవరం నిర్మాణానికి మార్గం సుగమమైనదని మంత్రి చెప్పారు. పట్టిసీమ ద్వారా 20 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాలోని సాగు, తాగునీటికి వినియోగిస్తామన్నారు. ఒకేరోజు పట్టిసీమ, తాడిపూడి, పురుషోత్తపట్నం, పుష్కర ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని విడుదల చేయడం ఒక రికార్డు అని మంత్రి చెప్పారు. పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా ఎనిమిది వేల క్యూసెక్కులు, తాడిపూడి 875 క్యూసెక్కులతో కృష్ణా డెల్టాలోని రైతులకు, పురుషోత్తపట్నం ద్వారా 3,500 క్యూసెక్కులు, పుష్కర ఎత్తిపోతల ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి ఏలేరు రిజర్వాయర్ లో నీటినిల్వలను పెంచి, ఉత్తరాంధ్రకు సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కు కూడా నీరు అందిస్తామన్నారు. 2014 డయాఫ్రమ్ వాల్ పూర్తికాకుండా నిర్మాణ ఏజెన్సీ, ఇంజనీరింగ్ అధికారులను గత ప్రభుత్వం మార్చి చారిత్రాత్మక తప్పిదం చేసిందన్నారు. పోలవరం సమస్యలను అధిగమించి ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని మంత్రి చెప్పారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్ట్ సైట్ కార్యాలయ సమావేశపు హాలులో అంతర్జాతీయ నిపుణుల బృందం సభ్యులతో సమావేశమై మంత్రి నిమ్మల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఐటీడీఏ పీవో ఎం. సూర్యతేజ, మద్దిపాటి వెంకటరాజు, ఆర్డీవో కె. అద్దయ్య , ఇరిగేషన్ ఎస్ఈ నరసింహ మూర్తి, ఈఈ బి.ఏసుబాబు, డీఈ పెద్దిరాజు, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు, తహసీల్దార్ జి.వి. ప్రసాద్, ఎంపీడీవో జి.శ్రీనివాస్, సర్పంచ్ సబ్బవరపు శ్రీరామమూర్తి, ఎంపీటీసీ సోమరోతు అనితాకుమారి, బొరగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## వీఆర్వోలకు పదోన్నతులు కల్పించండి

### మంత్రి అనగానికి గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం వినతి

**విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:** వీఆర్వోల పదోన్నతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం విన్నవించింది. వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఐక్యవేదిక చైర్మన్ కె.ఆర్.సూర్య నారాయణ సమక్షంలో రెవెన్యూ సంఘ నాయకులు రవీంద్రబాబు, సుగుణమ్మ, రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ తదితరులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వీఆర్వోలకు చెందిన వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీతో ఉన్నతాధికారుల ఒత్తిడితో వీఆర్వోలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని భూపతిరాజు రవీంద్రరాజు తెలిపారు. గత ప్రభుత్వంలో కుల గణన ద్వారా వలంటీర్లతో చేయించిన అసమగ్ర డేటాతో వీఆర్వోల లాగిన్లకు వందలాది ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులను అసమగ్ర సమాచారంతో పంపారని వివరించారు. ఇప్పుడు ఆ ధ్రువీకరణ పత్రాల ప్రక్రియను పూర్తి చేయాలని వీఆర్వోలపై ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారన్నారు. వీఆర్వోల పదోన్నతులు, వన్ టైం సెటిల్‌మెంట్, రేషియో విషయాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గ్రేడు 2 నుంచి గ్రేడ్ 1 పదోన్నతుల అంశంపై జారీ చేసిన జీవో 166ను తక్షణమే అమలు చేయాలన్నారు. గ్రేడ్ 2, వీఆర్వోల ప్రొబిషన్‌కి సంబంధించి మెమో ఇచ్చి ఆరు నెలలయినా ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వెంటనే వారందరికీ ప్రొబిషన్ డిక్లేర్ చేసేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. కారుణ్య నియామక ఉద్యోగులకు వెంటనే ప్రొబిషన్ ఖరారు చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనాను సంఘం నేతలు కలిసి బీఎల్‌ఓలకు ఇవ్వాల్సిన గౌరవ వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు.

సంపాదకీయం

# ఏడవ లేక ఎద్దేవా

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సోమవారం లోక్‌సభలో చర్చ ప్రారంభించిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రధానమంత్రి మోదీ మనసును ఛిద్రం చేసేశారు. అప్పటికే రాహుల్ ప్రసంగం మధ్యలో రెండుసార్లు జోక్యం చేసుకుని సభా సంప్రదాయాన్ని ఉల్లంఘించారు. ఇలాంటి సందర్భాలలో ప్రతిపక్ష నాయకుడు చర్చ ప్రారంభించడం, చర్చ ముగిసిన తరవాత ప్రధానమంత్రి సమాధానం చెప్పడం పరిపాటి. ప్రధానమంత్రి మోదీ తాను దైవాంశ సంభూతుడిని అని చెప్పుకుంటారుగనక రాహుల్ గాంధీ గంటా నలభై నిముషాలు మాట్లాడితే మోదీ రెండు గంటలకు పైగా మాట్లాడారు. రాహుల్ అంత తీవ్ర విమర్శలు చేసిన తరవాత ప్రధాని ఏ సమాధానం ఇస్తారోనని ఎదురు చూడడం సహజమే. రాహుల్‌ను పప్పు అని సంబోధించిన మోదీకి ఇప్పుడు అదే మాట మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. అందుకని ఈ సారి కొత్త మాట కనిపెట్టి "బాలక్" అన్నారు. యాభై ఏళ్లు దాటినా రాహుల్ కు బాల్య చేష్టలు పోలేదని మోదీ నమ్ముతున్నారు. అందుకే ప్రతిపక్ష నాయకుడిగా ఆయన ప్రసంగంలో మోదీకి "బాలక్ బుద్ధి" మాత్రమే కనిపించింది. రాహుల్ లేవనెత్తిన ఒక్క అంశానికి కూడా సమాధానం ఇచ్చే శక్తి బీజేపీకీ, మోదీకి లేదు. అందువల్ల నరనరాల్లో జీర్ణించుకుపోయిన అసత్య ప్రచారం, వక్రీకరణ, విద్వేషం అనే ఇదివరకటి మాటలనే మోదీ తన సమాధానంలో ధారాళంగా వినియోగించారు. అసలు రాహుల్ మాట్లాడుతున్నంత సేపూ మోదీ సభలో ఉండడం విశేషమే. రాహుల్ మాట్లాడడం అయిపోగానే వెళ్లి పోయారు. ప్రతిపక్ష నాయకుడు ప్రధానమైన ప్రసంగం చేసేటప్పుడు సభా నాయకుడు సభలో ఉండాలన్న నియమం ఉంది కాబోలు. అందుకే ఊపిరి బిగబట్టి కూర్చున్నట్టున్నారు. మంగళవారం మోదీ సమాధానం ఇవ్వాల్సి వచ్చిన సమయంలో పాత అబద్ధాలకు తోడు కొల్లలుగా కొత్త అబద్ధాలను గుప్పించారు. బాలక్, బాలక్ బుద్ధి లాంటి మాటలను పదే పదే వాడి పార్లమెంటరీ పరిభాషను కలుషితం చేశారు. ప్రతిపక్ష నాయకుడిని అలాంటి చవకబారు మాటలతో సంబోధించడం పార్లమెంటరీ వ్యవస్థ మీద ఏ మాత్రం విశ్వాసంలేని మోదీ లాంటివారికే సాధ్యం. ఏ ప్రధానమంత్రీ ఇప్పటిదాకా ఇంత చౌకబారుగా మాట్లాడిన దాఖలాలు లేవు. సందు దొరికితే కళ్లు మూసుకునే నిద్రపోయే గౌడ అనిపించుకున్న దేవగౌడ కూడా పార్లమెంటులో హుందాగానే ప్రవర్తించారు. అందరు నాయకులూ ఒకలా ఉండరు. ఎవరి తాహతు వారిది. ఎవరి సామర్థ్యం వారిది. ఎవరి విషయ పరిజ్ఞానం వారిది. అందులో హెచ్చు తగ్గులు ఉండొచ్చు. అవి సహజం. కానీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 2014, 2019 ఎన్నికల తరవాత ప్రధానమంత్రి అయినప్పుడు బీజేపీకి సంపూర్ణమైన మెజారిటీ ఉంది కనక ఆయన నిరాటంకంగా ఆధిపత్య ధోరణి అనుసరించగలిగారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎన్.డి.ఎ. భాగస్వామ్య పక్షాల మీద ఆధారపడక తప్పని పరిస్థితి. అయినా ఆధిపత్యం చెలాయించడానికి మాత్రమే అలవాటుపడిన వ్యక్తికి అమాంతం అణకువ అలవడుతుందనకోవడం అత్యాశే. అందుకే రాహుల్ పేరెత్తకుండానే బాలక్, బాలక్ బుద్ధి లాంటి నేలబారు మాటలు మాట్లాడగలిగారు. బాలక్, బాలబుద్ధి అనడం ద్వారా మోదీ బాలలను అవమాన పరిచినట్టే. ప్రతిపక్షం, ప్రతిపక్ష నాయకుడు అంటే మోదీలో ఛీత్కార దృష్టి మోదీ మనసులో గూడు కట్టుకుంది. ఆయన అహంకారానికి చిహ్నం. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడితో సహా ఎంత సీనియర్ నాయకుడైనా ఒక్కోసారి నోరుజారే అవకాశం ఉండొచ్చు. కాని విజ్ఞులైన సభ్యులు తమ తప్పు గ్రహించి వెంటనే క్షమాపణలు చెప్తారు. కానీ మర్యాద అతిక్రమించడం మోదీకి నిత్యకృత్యం.

1984 తరవాత కాంగ్రెస్ కు ఎన్నడూ 250 సీట్లు మించి రాలేదని మోదీ దెప్పి పొడిచారు. కానీ 1991 ఎన్నికలలో కాంగ్రెస్ కు 232 స్థానాలే వచ్చినా పీవీ నరసింహా రావు ప్రభుత్వం అయిదేళ్లూ విజయవంతంగా పదవీ కాలం పూర్తి చేసుకుంది. ఈ సారి ఎన్నికలలో బీజేపీ ఎందుకు 240 సీట్ల దగ్గరే కుదేలైపోయిందో మాత్రం మోదీ తన ప్రసంగంలో ఎక్కడా ప్రస్తావించలేదు. వాస్తవం అంగీకరించడం మోదీవల్ల అయ్యే పని కాదు. అనివార్యంగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయవలసి వచ్చినా సంకీర్ణ ధర్మాన్ని నిర్వర్తిస్తానని మాత్రం చెప్పలేక పోయారు. బీజేపీ సైద్ధాంతిక చిత్ర పటాన్ని రాహుల్ ఛిద్రం చేశారు. బీజేపీ సిద్ధాంత ప్రాతిపదికను రాహుల్ నిండు సభలో ఛిన్నాభిన్నం చేయడంతో మోదీ చలించి పోయారు. అందుకే రాహుల్ గాంధీ ప్రసంగంలోని ప్రధానాంశాలన్నింటినీ వక్రీకరించి ఎదురు దాడికి దిగారు. రాహుల్ గాంధీ నేరుగా హిందుత్వ సిద్ధాంతాన్ని ఎండగట్టారు. ఆర్.ఎస్.ఎస్., బీజేపీకి హిందుమతంతో సంబంధమే లేదన్నారు. దీన్ని మోదీ రాహుల్ హిందువులందరినీ అవమానించారు అని వక్రీకరించారు. మోదీ, బీజేపీ, ఆర్.ఎస్.ఎస్. హిందూ మతాన్ని గుత్తకు తీసుకోజాలదు అని రాహుల్ అనడం మోదీ బృందానికి బొత్తిగా మింగుడు పడలేదు. కాంగ్రెస్ మిత్రపక్షాల మీద ఆధారపడ్డ పరాన్న జీవి అని మోదీ తనకు ఇష్టమైన పాత మాటను పాముల బుట్ట లోంచి తీసినట్టే తీశారు. తన ప్రభుత్వమూ ఇప్పుడూ మిత్ర పక్షాల మీద ఆధారపడిందేగా! పైగా ఈ సారి జనం తమ ఏలుబడిని మెచ్చి సుస్థిరత, నిరంతరత కోసం బీజేపీని గెలిపించారని మోదీ నోటి నిండా అబద్ధమాడారు. అదే నిజమైతే బీజేపీకి మెజారిటీ వచ్చి ఉండాలిగా! పార్లమెంట్ లో నిర్భయంగా, కేసుల బాధ లేకుండా మాట్లాడడానికి ఉన్న విశేషాధికారాన్ని మోదీ అసత్య ప్రచారానికి లైసెన్సుగా మార్చేశారు. ప్రతిపక్షాలు బలపడిన సందర్భాన్ని సంవాదానికి, సంప్రదింపులకు వినియోగించుకోవలసింది పోయి ప్రతిపక్షాన్ని అణగదొక్కే క్రమంలో అపఖ్యాతిపాలుచేసే మార్గాన్నే ఎంచుకున్నారు. ఇప్పటిదాకా పదేళ్ల తమ ప్రభుత్వం కేవలం ఆకలి పెంచేదేనని, అసలు భోజనం ఇక ముందు ఉంటుంది చూడండి అంటున్నారు. కాంగ్రెస్ కు 60 ఏళ్లు ఇచ్చారు, నాకు 60 నెలలు ఇవ్వండి చాలు అని ప్రధాని కాక ముందు మోదీ అన్న తన మాటలను తానే విస్మరించారు. పదేళ్లలో ఏమీ చేయలేక పోయినందువల్లే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుంది చూడండి అని కొత్త ఆశలు కల్పిస్తున్నారు. పార్లమెంటులో సాక్షాత్తు ప్రధనమంత్రే దిగజార్చే స్థాయిలో మాట్లాడినప్పుడు వాటి మీద విమర్శలు కూడా అదే స్థాయిలో ఉండడం అనివార్యం కానక్కర్లేదు. కానీ అసత్యాలను, వక్రీకరణలను పొట్ట విప్పి చూడాల్సిందే. సార్వత్రిక ఎన్నికల తరవాత ఏర్పడిన లోక్‌సభలో ప్రతిపక్షాలకు గొంతు విప్పే అవకాశం వచ్చినందుకు సంతోషించాలిగానీ, మోదీ అసత్య ప్రచారాలను, వక్రీకరణలను ఎదుర్కొనే మార్గం ఏమిటో అన్వేషించవలసిందే. మోదీ దేవతా వస్త్రాల గుట్టు విప్పాల్సిందే. రాహుల్ విమర్శనాస్త్రాలు మోదీని చిందరవందర చేశాయి. అందుకే ఏడవలేక ఎద్దేవా చేస్తున్నారు.

## ఖ్యాతి అపఖ్యాతి కలిసిన మొయిత్రా

పార్లమెంట్ కార్య కలాపాలను టీవీల్లో ప్రత్యక్ష ప్రసారంలోనో, యూట్యూబ్ చానళ్లలోనూ చూసేవారికి మహువా మొయిత్ర గురించి తెలియకుండా ఉండదు. లోక్‌సభలో ఆమె ప్రసంగాలు చాలా వాడిగా ఉంటాయి. బెంగాలీ కుటుంబంలో పుట్టినప్పటికీ హిందీ, ఇంగ్లీషు భాషల్లో అనర్గళంగా మాట్లాడతారు. 2019లో మొట్టమొదటిసారి లోక్‌సభకు ఎన్నికైనప్పుడు ఆమె తొలి ప్రసంగంలోనే తన తాహతు ఏమిటో తెలియపరిచారు. ఈ దేశంలో ఏడు రూపాల్లో ఫాసిజం సాగుతోందని హెచ్చరించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత ఫాసిస్టు ఛాయలు గమనించిన వారికి మహువా మొయిత్రా హెచ్చరిక అవగతమై ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో న్యూయార్క్‌లో, లండన్ లో జె.పి. మోర్గాన్ బ్యాంకులో ఉన్నతోద్యోగం చేసిన మొయిత్రా ఆ తరవాత రాజకీయాల్లో ప్రవేశించారు. యూత్ కాంగ్రెస్‌లో పని చేశారు. అప్పుడు రాహుల్ గాంధీ "ఆమ్ ఆద్మీ కి సిపాహీ"గా ఉన్నారు. ఆ తరవాత 2010లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. 2016 నుంచి 2019 దాకా బెంగాల్ శాసనసభ్యురాలిగా ఉన్నారు. సోమవారం లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తీర్మానంలో మాట్లాడినప్పుడు ఆమె విమర్శ ఎంత పదునుగా ఉంటుందో మరోసారి అర్థం అయింది. ప్రతి ఎంపీ రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు కాని ఆ రాజ్యాంగానికే ముప్పు ఉందంటారు. 2021 ఫిబ్రవరి 8న లోక్‌సభలో మాట్లాడుతూ పవిత్రంగా ఉండవలసిన న్యాయవ్యవస్థ కూడా పవిత్రంగా లేదని అంగలార్చారు. రంజన్ గొగోయ్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు తన మీద లైంగిక అత్యాచారాల ఆరోపణలు వస్తే ఆ కేసును తానే విచారించి నిర్దోషినని ప్రకటించుకున్నప్పుడే న్యాయ వ్యవస్థ పవిత్రతకు భంగం కలిగిందంటారు. ఈ ప్రసంగంపై లోక్‌సభలో గగ్గోలు మొదలైంది. అధికారపక్ష సభ్యులు ఆమె మీద దుమ్మెత్తి పోస్తే ప్రతిపక్షాలు సమర్థించాయి. ఎందుకంటే ఆమె మాట్లాడింది అక్షర సత్యం. అదానీని విమర్శించడంలో, మోదీకి, అదానీకి ఉన్న సాన్నిహిత్యం గుట్టు విప్పడంతో ఆమె మీద బీజేపీ దాడి పెరిగిపోయింది. అదానీ మీద విమర్శల్లో ఆమె రాహుల్‌తో పోటీ పడ్డారు. బీజేపీ ఎంపీ నిశికాంత్ దుబే, సుప్రీంకోర్టు న్యాయవాది జై అనంత్ దేహద్ రాయ్ ఆమె మీద సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆ ఎఫ్.ఐ.ఆర్. ప్రతిని లోక్‌సభ స్పీకర్‌కూ పంపించారు. ఆయన దానిని సభ నైతిక కమిటీ పరిశీలనకు పంపారు. అదానీ మీద దాడి చేయడానికి దర్శన్ హీరనందానీ నుంచి ఆమె డబ్బు ముట్టిందన్నది ఆ ఆరోపణల్లో ప్రధానాంశం. నైతిక కమిటీ విచారణ తంతు నడిపి ఆమెను సభ నుంచి బహిష్కరించాలని 2023 నవంబర్ 9న సిఫార్సు చేసింది. 2023 డిసెంబర్ 8న బహిష్కరణ తంతూ ముగిసింది. అప్పుడే ఆమె మళ్లీ కృష్ణ నగర్ నియోజకవర్గం నుంచి ఎన్నికై లోక్‌సభకు

## ఒకే ఒక్కడు

వస్తానని సవాలుచేసి మొన్నటి ఎన్నికల్లో గెలిచారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానంపై ఆమె మాట్లాడిన ప్రతి మాటా బీజేపీని ఉక్కిరి బిక్కిరి చేసింది.సోమవారం నాటి ప్రసంగంలో "నారీ శక్తి గురించి మాట్లాడే ఈ ప్రభుత్వం నిజానికి మహిళలను సహించలేరు. 17వ లోక్‌సభలో 78 మంది మహిళలు ఉండేవారు. అంటే 13.3 శాతం. ఈసారి మహిళల ప్రాతినిధ్యం 74 కు పడి పోయింది. మూడుకోట్ల మంది మహిళలను లక్షాధికారుల్ని చేస్తామంటున్నారు. కానీ బహు కోటీశ్వరుడైన ఒకే వ్యక్తిని మరింత సంపన్నుడిని చేస్తున్నారు" అని నిర్మోహమాటంగా చెప్పారు. "చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లను మిథ్య కింద మార్చేశారు. అది ఎప్పటికో అమలులోకి వస్తుంది. మీకు మహిళలంటే భయం. నారీ శక్తి అంటే భయం" అని నిర్భయంగా ప్రకటించారు మొయిత్రా. "ఈశాన్య ప్రాంతానికి కేటాయింపులు నాలుగు రెట్లు పెంచామని రాష్ట్రపతి చెప్పారు. అందులో మణిపూర్ అన్న మాట ఎక్కడుంది? ఆ ప్రసంగంలో ఎక్కడా లేదు. ఎందుకు? ఎన్నికల ప్రచార సమయంలో బీజేపీ, ప్రధాని మోదీ "మ" అన్న అక్షరంతో మొదలయ్యే అనేక మాటలు వాడారు. ముసల్మాన్, ముల్లా, మదర్సా, మటన్, మచ్లీ, మంగళ సూత్రం, ముజ్రా లాంటి మాటలు దొర్లించారు కానీ మణిపూర్ మాటే లేదు. ప్రభుత్వం ఈశాన్య ప్రాంతంపై ఏం చేస్తుందన్న ప్రస్తావనే లేదు" అంటూ ఈశాన్య ప్రాంతాల వారిని ఆలింగనం చేసుకోవాలి అని అభ్యర్థించారు. ఆమె ప్రసంగం మొదలు పెట్టగానే మోదీ సభ నుంచి వెళ్లిపోవడం చూసి "నా మాటలు కూడా విని వెళ్లండి మోదీజీ" అన్నారు.

"జమ్ము-కశ్మీర్ కు వర్తించే 370వ అధికరణాన్ని రద్దు చేశారు. లదాఖ్‌లో బీజేపీ మూడో స్థానంలో మిగిలిపోయింది. కశ్మీర్ లోని శ్రీనగర్, అనంతనాగ్, బరాముల్లాలో బీజేపీ పోటీ అయినా చేయలేని స్థితిలో పడిపోయింది. జమ్మూ-కశ్మీర్ ప్రజలు 370వ అధికరణం రద్దును వ్యతిరేకించిన వారికి ఓటు వేశారు" అని మొయిత్రా బీజేపీ అసలు స్వరూపాన్ని బయట పెట్టారు. ఆమె ఎన్నికల కమిషన్‌నూ వదలలేదు. "ఎన్నికల కమిషన్ ఎన్ని అకృత్యాలకు పాల్పడినా ప్రతిపక్షం బలం పుంజుకుంది. ఎన్నికల ప్రచారంలో మోదీ చేసిన విద్వేష ప్రసంగాలను చూసి దేశవాసులు సిగ్గుతో తల దించుకున్నారు" అని గొంతెత్తి మాట్లాడారు మొయిత్రా. "అహ్మదాబాద్ నుంచి ముంబైకి బుల్లెట్ రైలు కోసం రూ. 1,08, 000 కోట్లు కేటాయించారు. అత్యంత వేగంగా వెళ్లే ఒక కిలోమీటర్ రైలు నిర్మాణానికి రూ. 200 కోట్లు ఖర్చవుతాయి. రైళ్లు ఢీ కొన కుండా కవచ్ సదుపాయం ఏర్పాటు చేయడానికి కి.మీ.కు రూ.50,00,000 ఖర్చు అవుతుంది. అంటే దీనికి మొత్తం ఖర్చయ్యేది 63,000 కోట్లు మాత్రమే. బాలాసోర్‌లో మూడు రైళ్లు ఢీకొని 296 మంది మరణించారు. గత వారం కాంచన్ గంగ రైలు ప్రమాదంలో 10 మంది మరణించారు. కవచ్ ఉంటే ఈ ప్రమాదాలను నివారించగలిగే వాళ్లం. కాని దీనికోసం ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను బట్టి దేశమంతా కవచ్ అందుబాటులోకి రావడానికి 50 ఏళ్లు పడ్తుంది. ఇది విశ్వగురువు నిర్వాకం" అని మహువా మొయిత్రా మాత్రమే అనగలరేమో! "బెంగాల్, మహారాష్ట్ర, పంజాబ్ లో మోదీ ప్రచారం చేసిన అన్ని నియోజక వర్గాల్లో బీజేపీ ఓడి పోయింది. రాజస్థాన్ లో 14 సీట్ల దగ్గర చతికిల పడి పోయింది. అయోధ్య రామ మందిరం నిర్మించిన చోటే ఫైజాబాద్ లో బీజేపీ చిత్తుగా ఓడిపోవడమే కాదు ఆ చుట్టుపక్కల కూడే అదే గతి పట్టింది" అని ఆమె తప్ప ఎవరు అనగలరు.

– అనన్య వర్మ

# సింగరేణి కొత్త గనుల వేలానికి కారకులెవరు?

వేల్పుల నారాయణ

సింగరేణిని ప్రైవేటీకరించడంలేదని కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం చెపుతోంది. బయటి ప్రపంచానికి ఇది వాస్తవమే అనిపించవచ్చు. కాని అదేసమయంలో దేశంలోని ఇతర బొగ్గుగనులతో పాటు సింగరేణి కొత్త బొగ్గుగనులను కూడా కేంద్రం వేలం వేస్తోంది. ఆ వేలం ద్వారా కార్పొరేట్లకు సింగరేణి కొత్త బ్లాకులను అప్పగించాలని చూస్తోంది. ఆ వేలంలో సింగరేణి ఇతర ప్రైవేటు కంపెనీలతో పాల్గొని ప్రైవేట్ వారికంటే ఎక్కువ మొత్తంలో బిడ్డింగు వేస్తేనే కొత్త గనులు దక్కించుకునే అవకాశం ఉంది. లేకుంటే సింగరేణికన్నా ఎక్కువ మొత్తం వేసిన ప్రైవేటు యజమానులకు సింగరేణి గనులు దక్కించుకోవచ్చు.ఇప్పటి వరకు సింగరేణి ప్రాంతంలో ఎక్కడైనా ఏ కొత్త గనినైనా ప్రారంభించే అధికారం హక్కు సింగరేణికి, రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉండేది. 1920లో దక్కన్ కంపెనీ సింగరేణి కాలరీస్ కంపెనీగా మారినప్పుడు గోదావరి పరివాహక ప్రాంతంలోని బొగ్గు నిక్షేపాలపై హక్కులన్ని సింగరేణికి కల్పించారని అప్పటినుంచి సింగరేణికి మాత్రమే ఈ ప్రాంతంలో బొగ్గు తవ్వకాలు చేసుకునే హక్కు ఉందని కార్మిక సంఘాలు అంటున్నాయి. అందువల్లనే సింగరేణిలో ప్రైవేట్ గనుల తవ్వకాలకు అవకాశం ఇప్పటివరకు లేదు. సింగరేణికి నైజాం కాలం నుంచి వస్తున్న ఈ హక్కును కాలరాసి వేలం ద్వారా ప్రైవేట్ వారికి దారదత్తం చేస్తున్నదెవరు? దానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నదెవరు? 51శాతం రాష్ట్రం, 49శాతం కేంద్రం వాటాతో జాయింట్‌వెంచర్ ప్రభుత్వరంగ పరిశ్రమగా 39 గనులతో, 40 వేల ఉద్యోగులు, కార్మికులతో బొగ్గు తవ్వకాల్లో ఆధునిక సాంకేతికతతో, ప్రతి ఏడు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ, వేలకోట్ల లాభాలను ఆర్జిస్తూ ప్రగతి పురోగమనంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సింగరేణికి భవిష్యత్తులో కొత్తగనులు రాకుండా, ఎలాంటి విస్తరణకు అవకాశం లేకుండా తనకు తానే కుంచించుకు పోయేవిధంగా కుట్రపన్నుతున్నదెవరు?ఎవరి పాత్ర ఎంతున్నదనేది ప్రజలు తెలుసుకోవాల్సి ఉంది.

దేశంలో వివిధ ప్రైవేట్ యాజమానుల ఆధీనంలో నడుస్తున్న బొగ్గు కంపెనీలను జాతీయ ప్రయోజనాల, ప్రజా ప్రయోజనం దృష్ట్యా అప్పటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ సాహసోపేతంగా 1973 మే 1న బొగ్గు గనుల జాతీయీకరణ చట్టం ద్వారా బొగ్గు పరిశ్రమను జాతీయం చేశారు. 1975లో కోల్ ఇండియా సంస్థ(సిఐఎల్)ను ఏర్పాటుచేసి ఆయా రాష్ట్రాల్లో దేశ వ్యాపితంగా ఉన్న బొగ్గు కంపెనీలన్నింటిని దాని అజమాయిషీలోకి తీసుకువచ్చారు. అప్పటికే సింగరేణిసంస్థ రాష్ట్ర ప్రభుత్వ సంస్థగా ఉండడం వల్ల కోల్‌ఇండియాతో సంబంధం లేకుండానే ఇప్పటివరకు స్వతంత్రంగా కొనసాగుతోంది. ఆ తర్వాత దేశంలో విద్యుత్తు, సిమెంటు, ఇనుము తదితర మౌలిక పరిశ్రమలు ప్రభుత్వ రంగంలోను, ప్రైవేట్ రంగంలోనూ రావడంవల్ల ఆయాసంస్థలు తాము సొంతంగా తమ పరిశ్రమలకు అవసరమైన బొగ్గు గనులను ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి కావాలనే డిమాండ్‌తో 1976లో, 1993లో, 1996లో 1973 బొగ్గుగనుల జాతీయకరణ చట్టానికి సవరణలుచేసి సొంత పరిశ్రమలకు అనుబంధంగా బొగ్గు గనులు తవ్వుకోవడానికి క్యాప్టివ్ మైన్సుగా అనుమతి కల్పించింది. కాని దీని ద్వారా సొంతంగా బొగ్గు వాడుకోవాలి తప్ప అమ్ముకొని వ్యాపారం చేయడానికి వీలు లేదు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సింగరేణి బొగ్గు తీయడం కష్టంగా ఉన్నదని, తీస్తే లాభదాయకం కాదనే నెపంతో అనిశెట్టి పల్లి, పెనుగడప, శ్రావణ పల్లి, పునుకుల చెలుక, గుండాల గనులను ప్రైవేట్‌కు క్యాప్టివ్ గనులుగా ప్రైవేట్ వారికి ఇవ్వడానికి కేంద్రం ప్రకటించింది. అప్పుడు సింగరేణి వ్యాపితంగా ఏఐటీయుసితో పాటు ఇతర కార్మిక సంఘాలు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించడంతో ఆ ప్రయత్నం

విరమించుకున్నారు. కేంద్ర ప్రభుత్వం 2005లో క్యాప్టివ్ మైనింగ్ క్రింద భూపాలపల్లి జిల్లాలోని తాడిచెర్ల బొగ్గు బ్లాకును రాష్ట్ర విద్యుత్‌సంస్థ జెన్‌కోకు కేటాయించింది. జెన్‌కోకు కేటాయించిన గనిలో బొగ్గు ఉత్పత్తి చేపట్టేందుకు అప్పటి సీఎం వైఎస్ఆర్ హయాంలో పీఎల్ఆర్ ప్రైవేట్ కంపెనీకి కాంట్రాక్టు ఇచ్చారు. బొగ్గు తీసేందుకు ఆ గనిని అపార అనుభవమున్న సింగరేణికి అప్పగించాలని, ప్రైవేటు కంపెనీకి కాంట్రాక్టు ఇవ్వడాన్ని నిరసిస్తూ 2011లో సింగరేణి కార్మికసంఘాలు పెద్దఎత్తున ఆందోళన చేశాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకించింది. ఉద్యమానికి స్పందించిన అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య పీఎల్ఆర్ కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్టును రద్దుచేసి తాడిచర్ల బొగ్గు తవ్వకాలు సింగరేణి చేపట్టాలనీ, సింగరేణి సీ అండ్ ఎండీకి లేఖ రాశారు. కార్మికులకు ఉపాధితో పాటు సింగరేణి కంపెనీకి లాభాలు తెచ్చిపెడుతుందనుకున్న తాడిచెర్ల బ్లాక్ ను తెలంగాణ రాష్ట్రం వచ్చాక టీఆర్ ఎస్ అధినేత, నాటి సీఎం కేసీఆర్ స్వయంగా 2015లో జెన్‌కో ద్వారా ఏఎంఆర్ అనే ప్రైవేట్ కంపెనీకి అప్పగించారు. కార్మిక సంఘాలు ఆందోళనచేసినా వినలేదు. అప్పటికే లాభాలు వచ్చే ప్రభుత్వరంగ పరిశ్రమలను తన కార్పొరేట్ మిత్రులకు దారాదత్తం చేసేందుకు వాటిని ప్రైవేటుపరం చేయడానికి పూనుకున్న బీజేపీ ప్రభుత్వం కోల్ ఇండియా పరిధిలో, సింగరేణి పరిధిలో గల బొగ్గుగనులను కూడా మెల్లమెల్లగా ప్రైవేటీకరించే ప్రయత్నాలు ప్రారంభించింది. అందువల్లనే దీనికి అడ్డంకిగా ఉన్న చట్టాలను మార్చడానికి పూనుకుంది. అప్పటి వరకు దేశవ్యాపితంగా ఉన్న సహజవనరులు, ఖనిజాలు తవ్వితీసి అభివృద్ధి చేయడానికి ఉద్దేశించిన మైన్స్ మినరల్ అండ్ డెవలప్‌మెంటు చట్టం 1957 ప్రకారం గనులు తవ్వడానికి అనుమతులిచ్చేవారు. దీనితోపాటు 1973లో తీసుకువచ్చిన బొగ్గుగనుల జాతీయీకరణ చట్టం ప్రకారం బొగ్గుగనులు నడిచేవి. ఈ రెండు చట్టాలను సవరించి ప్రైవేటీకరణకు అనుకూలంగా మార్చేందుకు 'బొగ్గు గనుల ప్రత్యేక నిబంధనలు' బిల్లు 2014ను అప్పటి బొగ్గు శాఖ మంత్రి పీయూష్ గోయల్ 2014 డిసెంబర్ 10న లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బొగ్గు గనుల జాతీయీకరణ చట్టం 1973లో, గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం 1957(ఎంఎండీఆర్)లో అనేక ప్రైవేటీకరణ అనుకూల సవరణలతో ఈ బిల్లు 2014 అక్టోబర్ 21న పార్లమెంటులో ఆమోదంపొందింది. ఆ తర్వాత 2015 లో చట్టంగా వచ్చింది. జాతీయీకరణ చట్టం ప్రకారం క్యాప్టివ్ మైన్సుగా అనుమతి పొంది తమ సొంత అవసరాలకు మాత్రమే బొగ్గును వినయోగించుకోవాల్సి ఉండే విధానం మార్చి బొగ్గును బహిరంగ మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రైవేట్ కంపెనీలను అనుమతించేలా ఈ బిల్లు వీలు కల్పించింది.అదేవిధంగా దేశంలో ఎక్కడైనా కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనులను పబ్లిక్‌వేలం లేదా ప్రభుత్వం అవసరమనుకుంటే వేలం లేకుండా నామినేషన్ ద్వారా కేటాయించే వీలు కల్పించింది. అంటే అప్పటివరకు తెలంగాణ సింగరేణి హక్కుగా ఉన్న కొత్త గనులన్నింటిని కేంద్రం తన ఆధీనంలోకి తెచ్చుకుంది. తెలంగాణలోని సింగరేణి ఉనికికి ప్రమాదంగా ఉన్న ఈ బిల్లును 2014లో పార్లమెంటులో ప్రవేశ పెట్టినప్పుడు తెలంగాణలో ఉన్న సింగరేణి సంస్థకు చెందిన ఎంతో ఖర్చు చేసి బొగ్గు నిక్షేపాల అన్వేషణ జరిపి తవ్వకానికి సిద్ధంగా ఉన్న గనులు కూడా వేలంవేసి ప్రైవేటీకరించే ఆస్కారముందని తెలిసి కూడా అప్పటి టీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు వారి ఎంపీలు బీజేపీ తో ఎలాంటి అవగాహన చేసుకున్నారో కాని దీన్ని వ్యతిరేకించలేదు. మౌనంగా బిల్లుకు మద్దతు తెలిపారు. తెలంగాణకు, సింగరేణి భవిష్యత్తుకు అన్యాయం చేశారు.

ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత 2020 జూన్‌లో బొగ్గుగనులను వ్యాపార పద్ధతిలో వేలంవేసే ప్రక్రియను ప్రధాని మోదీ ప్రారంభించారు. 2020 నుంచి 2023 వరకు కేంద్ర బొగ్గుశాఖ తొమ్మిది సార్లు వేలం నిర్వహించి 107 గనులు అమ్మివేసింది. 2021లో వేలం ప్రక్రియలో సింగరేణికి చెందిన బొగ్గు గనులు కూడా వేలంలో పెట్టడంవల్ల రాష్ట్ర వ్యాపితంగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో, కార్మికుల్లో పెద్ద ఎత్తున నిరసన రావడంతో దిద్దుబాటుచర్యగా వేలం వ్యతిరేకిస్తున్నామని నిరసన తెలుపుతూ, వేలం లేకుండానే సింగరేణి గనులు నామినేషన్ పద్ధతిలో సింగరేణికే కేటాయించాలని కేంద్రంపై కేసీఆర్ ఒత్తిడి తీసుకువచ్చినా వేలం ప్రక్రియ ఆగలేదు. ఒకదిక్కు సింగరేణి కంపెనీ ఇక్కడ గనుల వేలంలో పాల్గొనవద్దని ఆదేశించి మరో దిక్కు సింగరేణి కంపెనీ ఒడిశా బొగ్గు గనుల వేలం పాటలో పాల్గొనేందుకు ఆదేశించి ద్వంద్వనీతిని అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసింది. వేలం పాటలో పాల్గొని సింగరేణి ఒడిశాలోని నైనీ ఓపెన్ కాస్టు బొగ్గుగనిని దక్కిచుకుంది. సింగరేణి వేలం పాటలో అప్పుడు కోయగూడెం-3,సత్తుపల్లి-3, రెండు కొత్త బ్లాకులను ప్రైవేట్ కంపెనీలు దక్కించుకున్నాయి. కారణాలు ఏమైనా ఇంకా ప్రైవేట్ వ్యక్తులు పనులు ప్రారంభించలేదు. రాష్ట్రంలో ఎన్నికలు జరిగి బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. తిరిగి దేశవ్యాప్తంగా కేంద్రం 61 బొగ్గుగనుల వేలం ప్రక్రియ జూన్ 21 న ప్రారంభించింది. వేలంలో సింగరేణికి చెందిన శ్రావణ పల్లి బొగ్గు గనిని కూడా చేర్చింది. దీనిని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థత వల్లే సింగరేణి బావులను వేలం వేస్తున్నారని, బీజేపి కాంగ్రెస్ కుమ్మక్కై సింగరేణిని ప్రైవేట్ పరం చేస్తున్నాయని ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ తీసుకువచ్చిన బొగ్గు గనుల ప్రైవేటీకరణ,వేలం పాటల ఏఎండీఆర్ బిల్లుకు మద్దతు పలికిన బీఆర్ఎస్ చేసిన తన తప్పును కప్పి పుచ్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.

కాంగ్రెసు మాత్రం ఈ పాపం బీజేపీ,బీఆర్ఎస్‌లదేనని ఎదురు దాడి చేస్తూ బిల్లులోని సెక్షన్ 17 ఏ ప్రకారం వేలం లేకుండా నామినేషన్ పద్ధతిలో సింగరేణి గనులు సింగరేణికే కేటాయించాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకు వస్తోంది. మరోవంక సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల్లో గుర్తింపు కార్మిక సంఘంగా గెలిచిన ఏఐటీయుసి సింగరేణి కొత్తగనుల వేలంపాట ఆపాలని, నామినేషన్ పద్ధతిలో సింగరేణికి గనులు కేటాయించాలని పోరాట కార్యక్రమం తీసుకుంది. జులై 5 న సింగరేణి బంద్‌తో పాటు 15రోజుల పాటు కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన పోరాట కార్యక్రమం తీసుకుంది. ఎన్నికల సమయంలో సింగరేణిని ప్రైవేటీకరించబోమని, సింగరేణి అభివృద్ధికి కృషిచేస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే అనైతికంగా సింగరేణిలో కొత్తగనుల వేలం ప్రక్రియ ప్రారంభించి లాభాలు ఆర్జిస్తూ ప్రతి సంవత్సరం వేల కోట్లు రాయాల్టీ పేర కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లిస్తున్న సింగరేణిని ప్రైవేట్ పరంచేయడానికి పూనుకుంటోంది. దీనిని ప్రజలందరూ, అన్ని పార్టీలు సమైక్యంగా పోరాడి సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బలహీనపడుతున్న మీడియా స్వేచ్ఛ

నంటూ బెనర్జీ

ప్రపంచవ్యాప్తంగా పత్రికలు, మీడియా స్వేచ్ఛ రోజురోజుకీ బలహీన పడుతోంది. కొన్నిదేశాల్లో ప్రభుత్వాలు జర్నలిస్టులపై నిరంకుశంగా వ్యవహరిస్తూ, తమ రహస్యాలను బైటపెట్టినందుకు జర్నలిస్టులపై నిరంకుశంగా వ్యవహరిస్తూ చంపివేసిన ఘటనలున్నాయి. 30దేశాల్లో 360 మంది జర్నలిస్టులు పాలకుల రహస్యాలను కనిపెట్టినందుకుగాను అరెస్టుచేసి జైళ్లలో నిర్బంధించిన కేసులున్నాయి. ఇలాంటి వందల కేసుల్లో వికిలీక్స్ వ్యవస్థాపకుడు జులియస్ అసాంజె కేసు అత్యంత హృదయ విదారకరమైంది. అమెరికా నిఘాచట్టాన్ని ఉల్లంఘించారని కేసు బనాయించి జైలులో పెట్టారు. అసాంజే స్వేచ్ఛ పొందడానికి ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోని అల్బనెస్ సహాయం చేశారు. అమెరికా ఏ దేశంలో ఎన్ని అకృత్యాలు నిర్వహించి, అమెరికా నిఘాసంస్థ ఎన్ని ప్రభుత్వాలను కూల్చివేసిందని, ఇంకా అనేక విషయాలను బైటపెట్టి తమను అప్రతిష్టపాలు చేసిందని ఆగ్రహం వ్యక్తంచేసి అమెరికా అసాంజెను కష్టాలపాలు చేసింది. ఆస్ట్రేలియా దౌత్యపరంగా సహకరించి అమెరికాతో చర్చలు జరిపిన తర్వాత ఎట్టకేలకు అసాంజెకు విముక్తి లభించింది. తాను తప్పు చేసినట్లు అసాంజె అంగీకరించడం వల్లనే స్వేచ్ఛ లభించింది. 14ఏళ్లపాటు అసాంజె న్యాయపోరాటం చేశారు. ఆస్ట్రేలియా సంఘీభావం ఆయనకు లభించింది. అసాంజె జన్మించిన దేశం ఆస్ట్రేలియా. అంతిమంగా అమెరికా అసాంజెను శిక్షనుంచి మినహాయించాలని క్షమాబిక్ష పెట్టింది. అమెరికా సైనిక పత్రాలను, ఇరాక్, అఫ్ఘానిస్థాన్‌లపై అమెరికా చేసిన దాడులకు సంబంధించిన వీడియోలను అసాంజె బైటపెట్టారు. ఏ దేశంలో ఎన్ని ఘోరాలకు, నేరాలకు అమెరికా పాల్పడిన అంశంపై 'హిట్‌మాన్' పేరుతో పుస్తకం రాసి అమెరికా నిఘా విభాగానికి చెందిన రచయిత వారి గుట్టంతా బైటపెట్టారు. అమెరికా అఫ్ఘానిస్థాన్‌పై దాడిచేసి అనేకమందిని కస్టడీలోకి తీసుకుని అమెరికాలో ఖైదు విధించింది. మానవ హక్కులను ఉల్లంఘించి పౌరులను చంపి వేశారు. ప్రభుత్వాలే కాకుండా అనేకమంది ఉన్నత స్థానాల్లోఉన్న నాయకుడు చేసిన అక్రమాలనుసైతం బైటపెట్టారు. ప్రత్యేక సమాచారం పేరుతో రహస్యంగా దాచిన చర్యలను అసాంజె తన సామర్థ్యంతో వెలుగులోకి తీసుకొచ్చారు. ఆయన బ్రిటన్‌లో అత్యున్నత భద్రత కలిగిన జైలులో 5ఏళ్లకుపైగా శిక్ష అనుభవించారు. లండన్‌లోని ఈక్వెడార్ రాయబార కార్యాలయంలో ఏడేళ్లపాటు ఆశ్రయం పొందారు. ఆ తరువాత ఆయనపై అత్యాచారం కేసు నమోదైంది. అదే కాకుండా, పద్దెనిమిది క్రిమినల్ కేసులను కూడా ఆయనపై మోపారు. ఆయన ఇలాగే కొనసాగినట్లయితే అమెరికా జైలులో జీవితాంతం ఉండవలసి వచ్చేది. అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లపై అమెరికా సైన్యం దాడులకు సంబంధించి సైనిక రహస్యపత్రాలను కూడా అసాంజె బైటపెట్టారు. ప్రపంచంలో బహుశ: ఇలాంటి సాహస చర్యలను ఏ జర్నలిస్టు నిర్వహించలేదు. తప్పులు చేసినవారి తప్పులను బైటపెట్టినందుకే వికిలీక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజెను ఎనలేని కష్టాలకు గురిచేశారు. చివరకు తన తప్పులేకపోయినా తప్పు చేసినట్లు కోర్టులో అంగీకరించడంతో స్వేచ్ఛ కల్పించారు. ఆయన ఆస్ట్రేలియాకు చేరుకుని కుటుంబంతో కలిసి ఎంతో సంతోషాన్ని వెలిబుచ్చారు. కుటుంబసభ్యులు కూడా దీర్ఘకాలం తరువాత ఇంటికి వచ్చిన అసాంజేను హృదయపూర్వకంగా ఆహ్వానించారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ రిపోర్టర్ వివాన్ జర్షింకోవిచ్‌ని పదిహేను నెలలుగా మాస్కో జైలులో నిర్బంధించడంపై పశ్చిమదేశాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. అమెరికాకు 1500 కిలోమీటర్ల దూరంలో ఎక్టేరిన్‌బర్గ్‌లో విచారణ జరుపుతున్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌కోసం వార్తలు అందించే వివాన్‌పైన కూడా నిఘాచట్టాన్ని ఉల్లంఘించారని పేర్కొంటూ జైలులో పెట్టారు. అలాగే వాల్‌స్ట్రీట్‌కు చెందిన పాకిస్తాన్‌లో పనిచేసిన విలేకరి డేనియల్ పెరల్‌ను పోలీసులు అపహరించుకునిపోయి చంపివేశారు. వివాన్ పాకిస్తాన్‌లోని కరాచీలో ఉంటున్న ముబారక్ అలీ జిలానీని ఇంటర్వ్యూ చేసేందుకు వెళ్లారు. ఇదే విధంగా సౌదీ జర్నలిస్టు జమాల్ అహ్మద్ ఖషోగ్గి కూడా హింసకు గురయ్యారు. ఆయన అల్ అరబ్ న్యూస్ చానల్‌కు ప్రధాన ఎడిటర్‌గా చేశారు. 'మిడిల్ ఈస్ట్ ఐ' లో క్రమం తప్పకుండా ఒక కాలమ్ రాసేవారు. వాషింగ్టన్ పోస్టుకు ఆయన విలేకరిగా పనిచేశారు. అయనను ఇస్తాంబుల్‌లోని సౌదీ రాయబార కార్యాలయంలో సౌదీ ప్రభుత్వ ఏజంట్లు చంపివేశారని ఆరోపణలున్నాయి. సౌదీ రాచరిక కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. ఖషోగ్గి వాషింగ్టన్ పోస్టుకు నెలవారీ రాసే వ్యాసంలో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ దేశ పాలకుడిగా వ్యవహరించారు. ఎక్కువ సంవత్సరాలు గడవకుండానే ఖతార్ నుంచి ఇంగ్లీషు ఛానల్ అల్ జజీరాకు ఖతార్‌లో ఉంటూ ముగ్గురు జర్నలిస్టులు పనిచేశారు. వారు ఆస్ట్రేలియన్ పీటర్ గ్రస్టి, కెనడియన్ మహమ్మద్ ఫామి, ఈజిప్టుకు చెందిన బహర్ మొహమ్మద్‌లను ఈజిప్టు భద్రతాదళాలు కస్టడీలోకి తీసుకుని దేశ భద్రతను దెబ్బతీసారని కేసు నమోదుచేసి జైలులో పెట్టారు. వారిని నేరస్థులుగా పరిగణించి ఏడు నుంచి పదేళ్లపాటు జైలుశిక్ష విధించారు. అయితే అధ్యక్షుడు వారిని మన్నించి క్షమాబిక్ష పెట్టారు. జర్నలిస్టులను కాపాడేందుకు న్యూయార్క్‌లో ఒక కమిటీ ఏర్పడింది. అది లాభరహిత సంస్థ. ప్రపంచవ్యాప్తంగా విలేకరుల స్వేచ్ఛను మరింత పెంపొందిం చేందుకు పనిచేస్తున్నది. గత సంవత్సరం వరకు 30దేశాల్లో 363మంది జర్నలిస్టులను నిర్బంధించింది. ఎక్కువమంది జర్నలిస్టులను ఇరాన్, చైనా, మియన్మార్ దేశాలలో గత సంవత్సరం సిపీజే నివేదిక ప్రకారం, ఇండియాలో ఏడుగురు జర్నలిస్టులను నిర్బంధించారు. వీరిని మూడేళ్లపాటు జైలులో నిర్బంధంలో ఉంచారు. వీరిలో నలుగురిపై క్రూరమైన చట్టాన్ని మోపారు. జమ్ము కశ్మీర్ ప్రభుత్వ రక్షణా చట్టం క్రింద అరెస్టు చేశారు. నిర్బంధించిన వారిలో కశ్మీర్‌నుంచి పనిచేసే ఆసిఫ్‌సుల్తాన్, అలాగే కశ్మీర్‌కు చెందిన సజాద్ గుల్, ఇండిపెండెంట్ జర్నలిస్టులు రూపేష్ కుమార్ సింగ్, గౌతమ్ నవల్‌ఖా, మజీద్ హైదరీ, ఇర్ఫాన్ మెహరాజ్, ప్రబీర్ పురకాయస్థ(న్యూస్‌క్లిక్) ఉన్నారు. ఇంఫాల్ నుండి ప్రచురితమవుతున్న హైయన్ లాన్‌పావ్ పత్రికకు పనిచేస్తున్న జర్నలిస్టును ఈ సంవత్సరం జనవరి 5వ తేదీన అరెస్టు చేశారు. మతాలు, జాతుల మధ్య వ్యతిరేకతను రెచ్చగొడు తున్నారంటూ జర్నలిస్టులను అరెస్టు చేశారు. అయితే ఈ అరెస్టుల గురించి ఎక్కువ ప్రాంతాలకు తెలియదు. అలాగే ప్రబీర్ పురకాయస్థ అరెస్టు కూడా ఎక్కడా అంతగా తెలియదు. ఉన్నతస్థాయి విద్యార్హత కలిగిన టెలికాం ఇంజినీరు, సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న నవల్‌ఖా దిల్లీ సైన్స్ ఫోరం వ్యవస్థాపక సభ్యుడు. అయనను అరెస్టుచేసి తిహార్ జైలులో 2023 నవంబరు 2వతేదీన పెట్టారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు చెల్లదని తీర్పునిచ్చింది. అంతక్రితం దిల్లీ లోయర్‌కోర్టు బెయిల్ మంజూరుచేసింది. ఈ కోర్టు విధించిన శిక్ష మూలంగానే మొదట ఆయన జైలుకు వెళ్లారు. 74ఏళ్ల జర్నలిస్టును అక్రమ కార్యాకలాపాల (నిరోధక) చట్టం క్రింద అరెస్టు చేశారు. చైనాకు అనుకూలంగా ప్రచారం చేసేందుకు గాను విదేశాల నుంచి ఆయనకు నిధులు లభిస్తున్నాయన్న ఆరోపణలపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. పైగా చార్జిషీటులో వార్తల సిండికేట్‌ల కుంభకోణం అని పేర్కొన్నారు. అంతేకాదు, సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాడ్ ఇంకా ఇతర కాలమిస్టులకు పురకాయస్థ నిధులు అందచేస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అన్ని మీడియా వేదికలు-ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ప్రచార సాధనాలు ప్రజా ప్రయోజనంకోసం తమ ఆలోచనలను వెలుగులోకి తెచ్చేందుకు వారికి అన్ని హక్కులు ఉంటాయి. భారత ప్రభుత్వం అధికారిక రహస్యాల చట్టాన్ని అణచివేసే చట్టం, హక్కుగల సమాచార చట్టం (2005) మధ్య సమతుల్యత ఉండేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# జ్యుడిషియల్ విచారణ జరిపిస్తాం

- హైకోర్టు జడ్జి నేతృత్వ కమిటీ ఏర్పాటు
- కుట్ర కోణంలోనూ దర్యాప్తు
- హత్రాస్ ఘటనపై సీఎం ప్రకటన
- ఆసుపత్రుల్లోని బాధితులకు పరామర్శ

**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో నిర్వహించిన సత్సంగ్ తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. వందల కుటుంబాలను శోకసంద్రంలో ముంచింది. చిన్నారులు, మహిళలు, వృద్ధులు ప్రాణాలు కోల్పోయారు.స్వీయ ప్రకటిత భోలే బాబా ప్రవచనాలు వినేందుకు పరిమితికి మించి రెండు లక్షల మంది వరకు రావడం, ఆయన ఆశీర్వచనాలు పొందేందుకు ఎగబడటంతో, బాబా భద్రతా సిబ్బంది అడ్డుకోవడంతో, తోసేయడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో మొత్తం 122 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మొత్తం దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. అధికారుల నిర్లక్ష్య ధోరణికి అద్దం పట్టింది. లక్షల మంది భక్తులు హాజరైన క్రమంలో సరైనా భద్రతా ఏర్పాట్లు చేయకపోవడం, పదుల సంఖ్యలో పోలీసులను మోహరించడంపై ప్రశ్నలకు తావిచ్చింది.

మృతుల్లో హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల వారు ఉన్నారని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ బుధవారం వెల్లడించారు. ఈ దుర్ఘటనపై విశ్రాంత హైకోర్టు జడ్జితో జ్యుడిషియల్ విచారణ జరుపుతామని ప్రకటించారు. న్యాయ విచారణ కమిటీలో విశ్రాంత అధికారులతో పాటు పోలీసు అధికారులు ఉంటారని తెలిపారు. బాధ్యులను గుర్తించడంతో పాటు, కుట్ర కోణంలోనూ దర్యాప్తు జరిపిస్తామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకొనేలా నిబంధనలు రూపొందిస్తామని సీఎం వెల్లడించారు. యోగి ఆదిత్యనాథ్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిని కలిసి భరోసానిచ్చారు. ఆయన అంతకుముందు సర్క్యూట్ హౌస్‌లో అధికారులతో సమావేశమయ్యారు.

### సత్సంగ్ నిర్వాహకులపై ఎఫ్ఐఆర్

సత్సంగ్‌కు 80 వేల మందికి అనుమతిస్తే 2.5లక్షల మంది హాజరైనట్లు యూపీ పోలీసులు తెలిపారు. నిర్వాహకులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న నిందితుల్లో సత్సంగ్ నిర్వాహకుడు జగత్‌గురు సాకర్ విశ్వహరి పేరు లేదని పీటీఐ వెల్లడించింది. నిర్వాహకులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు తెలిపింది. నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించారని, హాజరయ్యే వారి సంఖ్యను తప్పుగా చూపారని, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించలేదని ఎఫ్ఐఆర్ పేర్కొంది.

### సుప్రీంకోర్టులో పిటిషన్

హత్రాస్ ఘటనపై సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. గతంలో జరిగిన తొక్కిసలాట ఘటనల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుణపాఠాలు నేర్చుకోలేదని, దీనిపై కఠిన మార్గదర్శకాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జి నేతృత్వ ఐదుగురు నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఈ ఘటనపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుంటే, సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులోనూ వ్యాజ్యం దాఖలైంది.

### రైల్వే ఆంక్షలు

సత్సంగ్‌కు హాజరైన మూడు వేల మంది తమ ఇళ్లకు వెళ్లేందుకు నిరీక్షిస్తున్నారు. సికందర్ రౌ స్టేషన్ గుండా వెళ్లే రైళ్ల వేగాన్ని గంటకు 15కిమీలకు పరిమితం చేస్తూ రైల్వేశాఖ ఆదేశాలిచ్చింది. మధురా- తనక్‌పూర్ ఫెయిర్ స్పెషల్, ఆగ్రా ఫోర్ట్-కాస్‌గంజ్ ప్యాసింజర్ స్పెషల్, బాంద్రా టెర్మినస్ అంత్యోదయ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచే స్థలాల్లో అదనపు స్టాపుగా సికందర్ రౌ స్టేషన్ చేర్చారు. ప్రయాణికుల సౌకర్యార్థం మిగతా రైళ్లు కూడా ఈ స్టేషన్‌లో ప్రత్యేకంగా ఆగేలా చేశారు. మంగళవారం ఘటన నేపథ్యంలో అవసరమైన వారికి ప్రాథమిక వైద్యం అందజేసేందుకుగాను డాక్టర్ సౌరభ్ డాండియల్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందం వైద్య సేవలు అందిస్తున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. అవసరమైతే సికందర్ రౌ స్టేషన్‌కు పంపేందుకు ప్రత్యేక రైళ్లు పంపేందుకు వీలుగా కాస్‌గంజ్ స్టేషన్‌లో మూడు ఖాళీ కోచ్‌లను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించింది.

### పేదల దుస్థితి...

సత్సంగ్‌కు హాజరైన తమ వారిని కోల్పోయిన కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. కుటుంబ సభ్యుల జాడ తెలియక కొందరు, మృతదేహాల తరలింపునకు ఇబ్బంది పడిన వారు ఇంకొందరు. శవాల మధ్య తన కుమార్తె కోసం వెత్తుకునే తల్లి రోదనలు ఒక వైపు మీ పిల్లలు ఇక లేరని తల్లిదండ్రులకు ఇవ్వలేని బంధువుల తడబాటు మరోవైపు. ఇది హత్రాస్ దుర్ఘటన మిగిల్చిన హృదయవిదారక దృశ్యం. ప్రభుత్వం నుంచి మీరు ఆశించేది ఏమిటని ఈ కుటుంబాలను అడిగితే... ఏమీ లేదు! ఇలాంటి దుస్థితి పేదలకే తప్ప ధనికులకు రాదని వారు కన్నీటి పర్యంతమయ్యారు.

రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన కావ్య (3), ఆయుష్ (9) విగతజీవులుగా మిగిలారు. ఈ విషయాన్ని వారి తండ్రికి చెప్పలేక పిల్లల మామయ్య ఇబ్బంది పడ్డారు. అలాగే ఐదేళ్ల కుమారుడిని వెంట పెట్టుకొని ఉన్నావోలోని బక్సర్ ప్రాంతం నుంచి వచ్చిన వివాహిత ఆచూకీ లేక దిక్కుతోచని స్థితిలో ఆమె కుటుంబం ఒక చోట నుంచి మరొక చోటుకు పరుగులు తీసింది. చివరకు విగతజీవిగా తల్లి లభించగా, పిల్లాడు ఏమయ్యాడో తెలియక ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది.

### పరారీలో భోలే బాబా?

సత్సంగ్ నిర్వహించిన బాబా నారాయణ్ హరి అలియాస్ భోలే బాబా పరారీలో ఉన్నట్లు తెలిసింది. మెయిన్‌పురిలో ఆశ్రమం వద్ద పోలీసులను భారీగా మోహరించారు. బాబాకు చెందిన రామ్ కుటీర్ ఛారిటబుల్ ట్రస్టులో అధికారులు సోదాలు నిర్వహించారు. బాబా తమకు కనిపించలేదని సర్కిల్ అధికారి సునీల్ కుమార్ సింగ్ తెలిపారు. అయితే ఆయన ఆశ్రమంలో ఉన్నారా లేదా అన్నది స్పష్టంచేయలేదు. కాగా, స్వీయ ప్రకటిత 'భోలే బాబా' అసలు పేరు సౌరభ్ కుమార్. గతంలో ఉత్తరప్రదేశ్ పోలీసు ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేశారు. 17 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగం చేసిన ఆయన స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకున్నారు. బాబా అవతారమెత్తారు. లక్షల సంఖ్యలో భక్తులను పొందగలిగారు.

## బీహార్‌లో కూలిన మరో వంతెన

### 15 రోజుల్లో ఏడో ఘటన

**పాట్నా:** ఎన్డీయే పాలిత బీహార్‌లో వరుసగా బ్రిడ్జిలు కూలుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా మరో బ్రిడ్జి కూలింది. సివాన్ జిల్లాలోని గండకి నదిపై నిర్మించిన ఈ చిన్న వంతెనలోని ఒక భాగం బుధవారం ఉదయం కూలిపోయింది. వంతెన కూలిపోవడానికి గల కచ్చితమైన కారణాలపై విచారణ జరుపుతున్నట్లు డిప్యూటీ డెవలప్‌మెంట్ కమిషనర్ ముఖేశ్ కుమార్ తెలిపారు. 'డియోరియా బ్లాక్‌లోని వంతెన ఒక భాగం బుధవారం ఉదయం కూలిపోయింది. బ్రిడ్జి కూలడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇప్పటివరకూ తెలియరాలేదు. సీనియర్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటన తెల్లవారుజామున 5 గంటలకు జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ వంతెన 1982-83లో నిర్మించారు. గత కొన్ని రోజులుగా ఈ వంతెనపై మరమ్మతు పనులు జరుగుతున్నాయి' అని ఆయన తెలిపారు. కాగా, రాష్ట్రంలో వంతెన కూలిపోవడం 15 రోజుల వ్యవధిలో ఇది ఏడోది. సివాన్ జిల్లాలో 11 రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం. గత నెల 22న సివాన్ జిల్లాలో చిన్నపాటి వంతెన ఒకటి కుప్పకూలింది. దారౌందా, మహారాజా గంజ్ బ్లాక్స్‌లోని రెండు గ్రామాలను కలుపుతూ కెనాల్‌పై కట్టిన ఈ బ్రిడ్జ్..చాలా ఏండ్ల క్రితం నాటిదని, కెనాల్‌లోని నీటి ప్రవాహ ధాటికి పిల్లర్లు దెబ్బతిని వంతెన కూలిందని జిల్లా కలెక్టర్ ముకుల్ కుమార్ గుప్తా తెలిపారు. జూన్ 27న కిషన్‌బాగ్ జిల్లాలో, జూన్ 23న తూర్పు చంపారన్ జిల్లాలో, 22న సిశాన్‌లో, 19న అరారియాలో ఇలాగే వంతెనలు కూలిపోయాయి. ఆ తర్వాత జూన్ 29న మధుబని ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. వరుసగా వంతెనలు కూలిపోతుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నదులు, కాలువలపై నిర్మించిన వంతెనల పటిష్టతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పబ్లిక్ వర్క్స్‌లో నాణ్యతా లోపాలు, అక్రమాల వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. వరుస ప్రమాదాలతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ప్రమాదవశాత్తు కూలిపోయాయా? లేక ఎవరైనా కావాలనే కూల్చి వేస్తున్నారా? అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు.

## ప్రతిపక్షాల వాకౌట్ 'ప్రమాదకరమైన దృష్టాంతం'

### రాజ్యసభ చైర్మన్ ధన్కర్

**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం ఇస్తున్న సమయంలో వాకౌట్ చేయడం ద్వారా ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా ప్రమాదకర దృష్టాంతాన్ని నెలకొల్పాయని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్ బుధవారం అన్నారు. సభను వాయిదా వేయడానికి ముందు రాజ్యసభ 264వ సమావేశం ముగింపు వ్యాఖ్యలలో ధన్కర్... చర్చ సమయంలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే సభ వెల్‌లోకి నడవడాన్ని 'పార్లమెంటరీకి అవమానం' అని తెలిపారు. 'విపక్ష నేతలు సభను కాదు... మర్యాదను విడిచి వెళ్లారు. ప్రజాస్వామ్యాన్ని అవమానించారు. సభలో ప్రతి సభ్యుడికి అవకాశం ఇస్తున్నాం. కానీ, వారు రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తున్నారు. రాజ్యాంగంపై హేళనగా ప్రవర్తించడం సమంజసం కాదు. రాజ్యాంగం అనేది చేతిలో పుస్తకం కాదు. జీవితానికి మార్గదర్శకం' అని విపక్షాలపై మండిపడ్డారు. అధికార, ప్రతిపక్షాల రెండింటి నుంచి క్రియాశీల భాగస్వామ్యం ఉన్నందున, 'సభా కార్యకలాపాలను దెబ్బతీయడం నా మనస్సుకు బాధ కలిగించింది. అనుభవజ్ఞులైన సభ్యులు బాధ్యతారహితంగా ప్రవర్తించడం చాలా నిరుత్సాహపరిచింది. ఇది సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగించడమే కాకుండా పార్లమెంటు ప్రతిష్ఠను కూడా దెబ్బతీస్తుందని నేను పునరుద్ఘాటించాలనుకుంటున్నాను' అని అన్నారు. 'రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో 21 గంటలకు పైగా 76 మంది సభ్యులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కొత్తగా ఎన్నికయిన 19 మంది సభ్యుల తొలి ప్రసంగాలను కూడా సభ విన్నది' అని చైర్మన& ధన్‌ఖడ్ చెప్పారు. ప్రధాన మంత్రి 'చర్చలో పాల్గొంటూ ఉత్సాహంగా ప్రసంగించారు' అని అన్నారు.

## ఉపరాష్ట్రపతి ధన్కర్‌తో మోదీ భేటీ

**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ పార్లమెంట్ భవనంలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్కర్‌తో భేటీ అయ్యారు. రాజ్యసభ 264వ సమావేశాలు బుధవారం మధ్యాహ్నం ముగిసిన అనంతరం జగ్‌దీప్ ధన్కర్‌తో మోదీ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో రాజ్యసభలో సభా నాయకుడు జేపీ నడ్డా కూడా పాల్గొన్నారు. రాజ్యసభ సమావేశాలు సాగిన తీరుపైనా ఈ సందర్భంగా వారు చర్చించారని సమాచారం. కాగా, అంతకు ముందు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యసభలో బదులిచ్చారు. ప్రధాని ప్రసంగానికి విపక్షాలు అడుగడుగునా అడ్డుతగిలాయి. విపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు గందరగోళం సృష్టించారు. విపక్ష నేత మాట్లాడేందుకు అనుమతించాలని నినాదాలు చేస్తూ ప్రధాని ప్రసంగానికి అడ్డుతగిలారు. పాలక పక్ష తీరును నిరసిస్తూ విపక్ష ఎంపీలు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. విపక్షాలు ఎగువ సభ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. సభను విపక్షాలు అవమానించడం తగదని, వారి తీరు మారకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

## 'కజిరంగ'ను ముంచెత్తిన వరద

### నీట మునిగిన జంతువులు

**గౌహతి:** అసోంలో వరద బీభత్సం కొనసాగుతోంది. ఎనిమిది నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. వరదల కారణంగా 23 జిల్లాల్లో 11.3 లక్షల మంది ప్రజలు ఇబ్బందులుపడ్డారు. ఇక ఈ ఏడాది వరదలు, కొండ చరియలు విరిగిపడటం, తుపానుల కారణంగా రాష్ట్రంలో మొత్తం 48 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు రెండు లక్షల మంది ప్రజలు ముంపు ప్రాంతంలో చిక్కుకుపోయారు. వారందరినీ అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా 72 పునరావాస శిబిరాలను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో ఎనిమిది వేల మందికిపైగా తలదాచుకుంటున్నారు. బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తోంది. దీంతో దిబ్రూగఢ్ జిల్లాలో పరిస్థితి దారుణంగా తయారైంది. గువహటిలో నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న దేవతా విగ్రహాలు నీట మునిగాయి. వరదల కారణంగా కజిరంగ జాతీయ పార్కు తీవ్ర ప్రభావానికి గురైంది. పార్కులోకి భారీగా నీరు చేరింది. దీంతో నాలుగు జింకలు నీటమునిగి మృతి చెందాయి. సుమారు 24 ఇతర జంతువులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో అసోం ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

## 'ఎల్‌వోసీ'ని సమీక్షించిన సైనికాధిపతి ద్వివేది

**పూంచ్/జమ్మూ:** సైనిక దళాల ప్రధానాధికారి ఉపేంద్ర ద్వివేది బుధవారం జమ్మూ కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి భద్రతా పరిస్థితి, సైనికుల కార్యాచరణ సంసిద్ధతను సమీక్షించారని అధికారులు తెలిపారు. జూన్ 30న భారత ఆర్మీ 30వ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ద్వివేది బుధవారం ఉదయం జమ్మూ చేరుకుని సరిహద్దు జిల్లా పూంచ్‌కు వెళ్లినట్లు వారు వివరించారు. జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్, నార్తర్న్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ సుచీంద్ర కుమార్, జమ్మూకు చెందిన వైట్ నైట్ కార్ప్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ నవీన్ సచ్‌దేవాతో కలిసి సైనిక దళాల ప్రధానాధికారి పూంచ్‌లో ఫీల్డ్ కమాండర్ల సమావేశానికి అధ్యక్షత వహించి ఫార్వర్డ్ ప్రాంతాలపై వైమానిక సమీక్ష చేసినట్లు అధికారులు చెప్పారు. సైనిక దళాల ప్రధానాధికారి 93 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్‌లోని కొంతమంది మాజీ సైనికులతో కూడా సంభాషించారు. 2022 నుంచి 2024 వరకు నార్తర్న్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా పనిచేసిన జనరల్ ద్వివేది... తిరిగి జమ్మూకు వెళ్లారు. సాయంత్రం ఆయన ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారని వెల్లడించారు. జమ్మూ కశ్మీర్‌లో కొనసాగుతున్న అమర్‌నాథ్ యాత్ర, భారీ ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల దృష్ట్యా ఆర్మీ చీఫ్ జమ్మూకశ్మీర్ పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకుంది.

## రాహుల్ నివాసం వద్ద భద్రత పెంపు

### దాడికి అవకాశం.. నిఘా వర్గాల హెచ్చరిక

**న్యూఢిల్లీ:** నిఘావర్గాల హెచ్చరికలతో పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇంటి వద్ద భద్రత పెంచారు. హిందూసంస్థలతో సంబంధా లున్న వ్యక్తులు రాహుల్‌పై దాడి చేసే అవకాశం ఉందని ఢిల్లీ పోలీస్ నిఘా వర్గాల నుంచి సమా చారం అందింది. ఈ నేపథ్యంలో హోంమంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు భద్రత పెంచారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ నివాసం వద్ద అదనంగా బలగాలను మోహరించారు. అదే ప్రాంతంలో నివశిస్తున్న కాంగ్రెస్ నేతలపై సైతం నిఘా వేశారు. లోక్‌సభలో అధికార పక్షాన్ని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనపై వివిధ హిందూ సంస్థల నాయకులు దాడి చేసే అవకాశం ఉందని ఢిల్లీ పోలీసులకు మంగళవారం అర్ధరాత్రి సమా చారం అందింది. ఆయనకు వ్యతిరేకంగా బ్యానర్స్, పోస్టర్లు వెలిసే అవకాశం ఉందని తెలిసింది. దాంతో రాహుల్ గాంధీ నివాసం వద్ద అదనంగా రెండు ప్లాటూన్ల బలగాలను మోహరించారు. ఒక్కో ప్లాటూన్‌లో 16 నుంచి 18 మంది పోలీసులు ఉంటారు. అంతే కాకుండా తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎనిమిది నుంచి 20 మంది అదనపు పోలీసులను మోహరించారు. న్యూఢిల్లీ సరిహద్దులను మూసివేసి క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే అనుమతి ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో పెట్రోలింగ్‌ను సైతం పెంచారు. న్యూఢిల్లీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ దేవేశ్ మహాలా సోమవారం రాత్రి జిల్లాలోని అన్ని ఏసీపీలు, పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జిలకు భద్రతను పెంచాలని ఆదేశాలు ఇచ్చారు. అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇంటెలిజెన్స్ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. హిందూ సంస్థలపై నిఘా పెట్టడమే కాకుండా... భవిష్యత్ వ్యూహాలను ఆరా తీయాలని ఆదేశించినట్లు సమాచారం. రాహుల్ గాంధీ నివాసం దగ్గర, ఇతర ప్రాంతాల్లో ఎక్కడా ఎలాంటి పోస్టర్లు, బ్యానర్లు వేయకుండా చూడాలని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## లేహ్‌లో భూకంపం...

### రిక్టర్ స్కేలుపై 4.4 తీవ్రత నమోదు

**లేహ్:** లడఖ్‌లోని లేహ్‌లో బుధవారం ఉదయం భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.4గా నమోదైంది. ఈ విషయాన్ని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఉదయం 8.12 గంటలకు లేహ్‌లో భూకంపం సంభవించిందని ఎన్‌సీఎస్ తెలిపింది. సముద్ర మట్టానికి 150 కిలోమీటర్ల లోతులో 36.10 వెడల్పు, 74.81 పొడవుతో భూకంపం నమోదైందని ఎన్‌సీఎస్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొంది. ఈ భూకంపంవల్ల ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని తెలిపింది. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొంది.

## సర్వైకల్ వ్యాక్సినేషన్‌తో కేన్సర్‌కు అడ్డుకట్ట: సుధామూర్తి

**న్యూఢిల్లీ:** సర్వైకల్ వ్యాక్సినేషన్‌తో కేన్సర్‌కు అడ్డుకట్ట వేయవచ్చని రాజ్యసభ ఎంపీ సుధామూర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆమె సభలో మాట్లాడారు. రచయిత్రి, వితరణశీలిగా సుపరిచితురాలైన సుధామూర్తి తొలి ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎగువసభకు బుధవారం వచ్చిన మోదీ ... మహిళల ఆరోగ్యంపై ఆమె మాట్లాడిన విధానంపై స్పందించారు. ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సుధామూర్తి రాజ్యసభ ఎంపీగా నామినేట్ అయ్యారు. 'తొమ్మిది నుంచి 14 ఏళ్ల మధ్య వయసులో ఉన్న బాలికలకు సర్వైకల్ వ్యాక్సినేషన్ ఇస్తుంటారు. దానిని తీసుకుంటే కేన్సర్‌ను అడ్డుకోవచ్చు. చికిత్స కంటే నివారణ మేలు కాబట్టి... అమ్మాయిల మెరుగైన భవిష్యత్తు కోసం దానిని అందివ్వాలి' అని వెల్లడించారు. ఈసందర్భంగా తన తండ్రి చెప్పిన మాటలను గుర్తు చేసుకున్నారు. 'ఒక కుటుంబంలో తల్లి ప్రాణాలు కోల్పోతే... ఆసుపత్రి లెక్కలో అది ఒక మరణం. కానీ ఆ కుటుంబానికి అది తీరని లోటు' అని తన మనసులో నాటుకుపోయిన ఆ మాటల సారాన్ని ప్రస్తావించారు. అలాగే కోవిడ్ సమయంలో దేశవ్యాప్తంగా నిర్విఘ్నంగా వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించామని గుర్తుచేసిన ఆమె... ఆ అనుభవంతో సర్వైకల్ వ్యాక్సిన్‌ను బాలికలకు అందించడం కష్టమేమీ కాదని అన్నారు. దీంతోపాటు వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను ప్రస్తావించారు. ఆదాయాన్ని పెంచే దిశగా పర్యటనలకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా రోడ్లు, టాయిలెట్లు వంటి సదుపాయాలను మెరుగుపర్చాలని సూచించారు. ఆమె ప్రసంగాన్ని ఉద్దేశించి బుధవారం మోదీ మాట్లాడారు. 'మహిళల ఆరోగ్యంపై సమగ్రంగా మాట్లాడిన సుధామూర్తిజీకి కృతజ్ఞతలు. గత పదేళ్లకాలంలో ప్రభుత్వం మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రధానంగా దృష్టిసారించింది' అని తెలిపారు. తమ ప్రభుత్వం శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేసిందని, గర్భిణులకు వ్యాక్సినేషన్‌ను తీసుకువచ్చామని సభావేదికగా వెల్లడించారు. కాగా, సర్వైకల్ కేన్సర్‌ను అదుపు చేయడానికి బాలికలకు టీకాలు వేయించడానికి తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మధ్యంతర బడ్జెట్లో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

## మహిళలకు ఉచిత బస్సు... జీతాలు ఇవ్వలేకపోతున్న పంజాబ్ ఆర్టీసీ

**పాటియాలా:** పంజాబ్‌లో మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసి సిబ్బందికి జీతాలు కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేకపోతోంది. 2021 ఏప్రిల్‌లో అమరిందర్ సింగ్ ప్రభుత్వం ఆ పథకాన్ని ప్రారంభించింది. దాని వల్ల పంజాబీ మహిళలు కొంత లాభపడ్డారు. ప్రభుత్వ బస్సుల్లోనే పేద మహిళలు ప్రయాణిస్తున్నారు. తక్కువ ఆదాయం ఉన్న మహిళలు ఉచితంగా ట్రావెల్ చేస్తున్నారు. కానీ పెప్సు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(పీఆర్టీసీ) తీవ్ర నష్టాల్లో ఉన్నది. ఆ సంస్థ ఆదాయానికి గండి పడింది. మరో వైపు ఆ సంస్థకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.250 కోట్లు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో.. పీఆర్టీసీ తమ ఉద్యోగులకు జీతాలు, పెన్షలు ఇవ్వలేకపోతున్నది. బకాయిలు రిలీజ్ చేయాలని ప్రభుత్వానికి అనేక మార్లు లేఖలు రాసినట్లు పీఆర్టీసీ అధికారులు తెలిపారు. నిజానికి రూల్స్ ప్రకారం ప్రతి నెలా బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుందని పీఆర్టీసీ అధికారి చెప్పారు. మహిళలకు ప్రభుత్వ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని గత కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టింది. రీయింబర్స్‌మెంట్ రూపంలో ప్రతి రోజు ప్రభుత్వం పీఆర్టీసీకి కోటి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో రీయింబర్స్‌మెంట్ ఆలస్యమైంది. దీంతో పీఆర్టీసీ ఆర్థికంగా బలహీన పడింది. ఫ్రీ బస్సు స్కీమ్ సక్సెస్ అయిన నేపథ్యంలో ఆ స్కీమ్‌ను కొనసాగించనున్నట్లు ఆర్థిక మంత్రి హర్పాల్ చీమా ఇటీవల తెలిపారు. ఆ సర్వీసులను కొనసాగించేందుకు రూ.450 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కానీ బకాయిలు రిలీజ్ కాకపోవడం వల్ల ఆర్టీసీ ఉద్యోగుల, పెన్షనర్లు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు.

## మధ్యప్రదేశ్‌లో మూడేళ్లలో 31 వేల మంది మహిళల అదృశ్యం

**భూపాల్:** గడిచిన మూడేళ్లలో బీజేపీపాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 31 వేల మందికిపైగా మహిళలు, బాలికలు అదృశ్యమైనట్టు అధికారులు తాజాగా వెల్లడించారు. రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి బాలా బచ్చన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ప్రభుత్వం ఈ విషయాన్ని వెల్లడించింది. అధికారిక సమాచారం మేరకు... రాష్ట్రంలో 2021-2024 మధ్య 31,000 మందికిపైగా మహిళలు, బాలికలు అదృశ్యమయ్యారు. అందులో 28,857 మంది మహిళలు కాగా, 2,944 మంది బాలికలు ఉన్నారు. ఈ లెక్కన సగటున రోజుకు 28 మంది మహిళలు, ముగ్గురు బాలికలు అదృశ్యమవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదృశ్యమైన వారి సంఖ్య వేలల్లో ఉన్నప్పటికీ అధికారికంగా 724 మిస్సింగ్ కేసులు మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఉజ్జయినిలో గత 34 నెలలుగా 676 మంది మహిళలు అదృశ్యమైనప్పటికీ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

ఇక సాగర్ జిల్లాలో అత్యధికంగా 245 మంది బాలికలు తప్పిపోయారు. ఇండోర్‌లో 2,384 మంది మహిళలు అదృశ్యమయ్యారు. రాష్ట్రంలో అదృశ్యమైన ఘటనల్లో ఇదే టాప్. ఇండోర్‌లో నెల రోజుల్లో 479 మంది మహిళలు అదృశ్యం కాగా, కేవలం 15 కేసులు మాత్రమే నమోదు కావడం గమనార్హం. కాగా, 2019-21 మధ్య దేశవ్యాప్తంగా 13.13 లక్షల మంది బాలికలు, మహిళలు కనిపించకుండా పోయారు. ఇందులో 1,98,414 మందితో బీజేపీపాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్ తొలిస్థానంలో నిలిచింది. 2019-21 మధ్య కాలంలో మహిళల మిస్సింగ్ కేసుల్లో టాప్-5 రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ (1,98,414), పశ్చిమబెంగాల్ (1,93,511), మహారాష్ట్ర (1,91,433), ఒడిశా (86,871), ఛత్తీస్‌గఢ్ (59,933) ఉన్నాయి.

## బాబాలకు పాలకులు సాగిలం: సంజయ్ సింగ్

**లక్నో:** యూపీలోని హాథ్రాస్‌లో జరిగిన భోలే బాబా సత్సంగ్‌లో నెలకొన్న విషాదం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఇంత పెద్దసంఖ్యలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతున్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొక్కిసలాటలో దాదాపు 121 మంది మరణించారు. ఈ ఘటనకు బాధ్యులైన బాబా ఆచూకీ అంతుబట్టడం లేదు. ఇక మంగళవారం మధ్యాహ్నం 3.30 నిమిషాలకు ... సత్సంగ్ ప్రాంగణం వద్ద తొక్కిసలాట జరిగింది. కానీ ఆ ఘటన తర్వాత భోలే బాబా ఆనవాళ్లు దొరకడం లేదు. ఆయన పరారీలో ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు. ఆ బాబా కోసం గాలింపు చర్యలు చేపడుతుండగా ఈ ఘటనపై దేశవ్యాప్తంగా కలకలం రేగింది. ఇక హథ్రాస్ తొక్కిసలాట ఘటనపై ఆప్ నేత సంజయ్ సింగ్ స్పందిస్తూ దేశంలో ప్రజల ప్రాణాలకు విలువలేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వ్యక్తి ఏకంగా తన పేరిట బాబా బజార్‌ను నిర్మిస్తున్నా ఆయనపై ఎలాంటి నియంత్రణ లేదని అన్నారు. ఇది కేవలం హథ్రాస్‌లోనే కాదని, దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. హర్యానాలో ఏం జరిగిందో మనమంతా చూశామని, హత్యాచార ఘటనలో దోషిగా తేలిన ఓ బాబా తాను కోరుకున్నప్పుడు బయటకు వస్తారని, ప్రభుత్వ యంత్రాంగం ఆయనకు సాగిలపడుతుందని అన్నారు. ఇలాంటి బాబాల మార్కెట్ దేశంలో ఓ వెలుగు వెలుగుతుంటే ఇలాంటి ఘటనలను ఎలా నియంత్రిస్తారని ప్రశ్నించారు.

# జికా కలకలం

- పూణెలో 6 కేసులు నమోదు
- అప్రమత్తంగా ఉండాలని రాష్ట్రాలకు కేంద్రం సలహా

ముంబై: మహారాష్ట్రలోని పూణెలో జికా వైరస్ కలకలం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ బారినప డినవారిలో ఇద్దరు గర్భిణులు కూడా ఉన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమ త్తమైంది. జికా వైరస్ కేసుల దృష్ట్యా అన్ని రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సలహా ఇచ్చింది. ముఖ్యంగా గర్భిణులకు వైరస్ పరీక్షలు నిర్వ హించాలని అన్ని రాష్ట్రాలను కేంద్రం ఆదేశిం చింది. పాజిటివ్ తేలిన తల్లుల పిండాల పెరుగుదలను పర్యవేక్షించడం ద్వారా నిరం తరం అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఇంటి ఆవరణలో ఏడిస్ దోమలు లేకుండా చూసేందుకు నోడల్ అధికారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించింది. నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, సంస్థలు, ఆరోగ్య సౌకర్యాల్లో కీటకాలు లేకుండా నిఘా పెంచాలని, నియం త్రణ కార్యకలాపాలను తీవ్రతరం చేయాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. కాగా, ఈ నెల ఒకటిన పూణెలో ఇద్దరు గర్భిణులు సహా ఆరుగురికి జికా వైరస్ పాజిటివ్ తేలిన విషయం తెలిసిందే. నగరంలోని అరంద్వానే ప్రాంతంలో నాలుగు, ముంద్వా ప్రాంతంలో రెండు కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం అరంద్వానేలో మొదటి కేసు నమోదయింది. 46 ఏళ్ల డాక్టర్ తొలుత జికా వైరస్ బారిపడ్డారు. అనంతరం అతడి కుమార్తె (15)కు వైరస్ సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. వీరిద్దరితోపాటు ముంద్వాకు చెందిన ఇద్దరి రిపోర్టులు పాజిటివ్‌గా వచ్చాయి. ఈ నలుగురితోపాటు అరం ద్వానేకు చెందిన ఇద్దరు గర్భిణులకు జికా వైరస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. జికా వైరస్ సోకిన ఆడ ఎడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వైరస్‌ను తొలిసారి 1947లో ఉగాండా అడవుల్లోని ఓ కోతిలో గుర్తించారు. ఆ తర్వాత ఆఫ్రికన్ దేశాలతోసహా భారత్, ఇండోనే షియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం లాంటి ఆసియా దేశాలకూ ఈ వ్యాధి వ్యాప్తి చెందింది. ఈ వైరస్ సోకినవారిలో జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# మణిపూర్‌పై పెదవి విప్పిన మోదీ

నెలకొంటున్న సాధారణ పరిస్థితులు

శాంతి స్థాపనకు కసరత్తు: మోదీ

న్యూఢిల్లీ: మణిపూర్ కోలుకుంటోందని, ఆ రాష్ట్రంలో హింస తగ్గుముఖం పట్టిందని ప్రధాని మోదీ అన్నారు. ఆయన బుధవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి కృతజ్ఞత తీర్మానంపై చర్చలో భాగంగా మణిపూర్ గురించి మాట్లాడారు. మణిపూర్‌లో హింస మొదలైనప్పటి నుంచి ప్రధాని ఆ రాష్ట్రంలో పర్యటించాలని, మాట్లాడాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. లోక్‌సభ మంగళవారం మణిపూర్ నినాదాలతో హోరెత్తింది. పతిపక్షాల డిమాండ్ క్రమంలో ప్రధాని ఎట్టకేలకు నోరు విప్పారు. మణిపూర్ గురించి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు క్రమంగా నెలకొంటున్నట్లు తెలిపారు. హింస తగ్గుముఖం పట్టిందన్నారు. రాష్ట్రంలోని అనేకచోట్ల బడులు తెరుచుకున్నాయని చెప్పారు. శాంతిని నెలకొల్పేందుకు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు నిర్విరామంగా శ్రమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 11వేలకుపైగా ఎఫ్‌ఐఆర్‌లు నమోదు కాగా 500 మందికిపైగా అరెస్టు అయ్యారని మోదీ వెల్లడించారు. వరదలు కూడా ఆ రాష్ట్రంలో బీభత్సం సృష్టించాయని, రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రాష్ట్రానికి పంపామని ఆయనన్నారు.

**జమ్మూకశ్మీర్‌లో తుదిదశకు ఉగ్రవాదంపై పోరు:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదంపై పోరు దాదాపుగా చివరి దశకు చేరుకుందన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం అంతమవుతున్నట్లు చెప్పుకొ చ్చారు. గతంలో షట్‌డౌన్లు, సమ్మెలు, ఉగ్రవాదల నుంచి బెదిరింపులు, బాంబు పేలుళ్ల వంటివి ప్రజాస్వామ్యంపై నల్లనీడగా ఉండేవని చెప్పారు. తాజా ఎన్నికల్లో రాజ్యాంగంపై అపారమైన నమ్మకాన్ని కనబరుస్తూ జమ్మూకశ్మీర్ ప్రజలు ఓటేశారని మోదీ చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటకం పుంజుకుందని, పెట్టుబడులు పెరిగాయని తెలిపారు.

**అవినీతిని ఉపేక్షించం:** అవినీతిపరులను ఉపేక్షించేది లేదని మోదీ ఉద్ఘాటించారు. పార్టీలకు అతీతంగా అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి వ్యవహారాల్లో సముచిత చర్యలు తీసుకునేలా దర్యాప్తు సంస్థలకు సర్వాధికారాలు ఉన్నాయని ప్రధాని తెలిపారు. అవినీతి గురించి మాట్లాడుతూ ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలను ప్రస్తావించారు. అదే సమయంలో పశ్చిమ బెంగాల్ గురించి మాట్లాడుతూ మహిళపై బహిరంగ దాడిని గుర్తుచేశారు. ఈ ఘటనపై విపక్షాలు మౌనం వహిస్తున్నాయని విమర్శించారు. సందేశ్‌ఖలి ఘటనను ప్రస్తావించారు. హింస, అన్యాయాన్ని సమ్మిళితంగా, నిష్పాక్షికంగా ఖండించాలని మోదీ పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్ రాజ్యాంగానికి పెద్ద శత్రువు:** కాంగ్రెస్ పార్టీని రాజ్యాంగానికి అతిపెద్ద శత్రువుగా మోదీ ఆరోపించారు. అవాస్తవాలు చెప్పే పార్టీ అని విమర్శించారు. ఎమర్జెనీ విధింపు, జాతీయ సలహా మండలి (ఎన్ఏసీ) ఏర్పాటు వంటివి కాంగ్రెస్ ద్వారా రాజ్యాంగ ఉల్లంఘనకు ఉదాహరణలన్నారు. ఇలాంటి పార్టీతోనా మీరు జట్టుకట్టేదంటూ వెనుకబడిన వర్గాలకు చెందిన కాంగ్రెస్ మిత్రపక్షాలనుద్దేశించి విమర్శించారు. ఎన్డీయే వరుసగా మూడవసారి అధికారంలోకి రావడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. తమ పదేళ్ల పాలనకు మెచ్చి ప్రజలు మరొక అవకాశమిచ్చారని చెప్పుకున్నారు. దశాబ్దం పాటు అధికారంలో ఉన్న పార్టీ తిరిగి ఎన్నిక కావడం 60ఏళ్లలో మొదటిసారి జరిగిందని గొప్పలు పోయారు. స్వీయసమృద్ధి దేశంగా భారత్‌ను ప్రగతి పథంలో ముందుకు సాగించేందుకు బీజేపీ నేతృత్వ ఎన్డీయేకు అనుకూలంగా ప్రజా తీర్పు వచ్చిందని అన్నారు. ఇదిలావుంటే, రాష్ట్రపతి ప్రసంగంపై కృతజ్ఞతా తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత నెలకొన్న గందరగోళంతో రాజ్యసభ వాయిదా పడింది. ప్రధాని సమాధానం, కృతజ్ఞతా తీర్మానానికి సభ ఆమోదంతో జూన్ 27న మొదలైన రాజ్యాసభ 264వ సెషన్ ముగిసింది. లోక్‌సభ మంగళవారం వాయిదా పడటం విదితమే.

## మోదీ... మణిపూర్ వెళ్లేదెప్పుడు : కాంగ్రెస్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రకటించారు కానీ వాస్తవానికి ఈశాన్య రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. గతేడాది మే నుంచి అట్టుడికిపోతున్న మణిపూర్‌ని మోదీ ఇప్పటివరకు సందర్శించలేదని, ఆయన ఎప్పుడు వెళతారని ప్రశ్నించింది. శాంతి నెలకొల్పేందుకు కృషి చేస్తున్నట్లు మోదీ చెప్పడాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ బుధవారం దుయ్యబట్టారు. 'కొన్ని నెలల మౌనం తర్వాత రాజ్యసభలో మణిపూర్ గురించి అవతారపురుడైన ప్రధాని ఒక ప్రకటన చేశారు. మణిపూర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఆ రాష్ట్రంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. ఇన్నర్ మణిపూర్ ఎంపీ ఆ రాష్ట్ర పరిస్థితులను లోక్‌సభకు ఇప్పటికే తెలియజేశారు' అని అన్నారు. మన నాన్ బయోలాజికల్ ప్రధానమంత్రి ఇప్పటివరకు మణిపూర్‌లో కాలు మోపలేదని, ఆ రాష్ట్ర రాజకీయ నేతలు ఎవరితోనూ ఆయన భేటీ కాలేదని, మంతనాలు జరపలేదని దుయ్యబట్టారు. మణిపూర్ గురించి రాష్ట్రపతి ప్రసంగంలో ప్రస్తావన లేదని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. 2023, మే 3వ తేదీ నుంచి ఆ రాష్ట్రం అట్టుడికిపోతోంది. లోక్‌సభలో మణిపూర్‌కు చెందిన విపక్ష ఎంపీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ప్రభుత్వ తీరును కాంగ్రెస్ ఇంతకుముందు ఖండించింది. ప్రధాని మాటల్లో కొత్తగా ఏమీ లేదని దుయ్యబట్టింది. ప్రధాని జోకులు వేశారు... విమర్శలు గుప్పించారు కానీ హింస బాధిత రాష్ట్ర ప్రతినిధి చెప్పేది వినేందుకు ఆయనకు సహనం లేకపోయిందని విమర్శించింది. మణిపూర్ దుస్థితి నుంచి మోదీ కావాలనే చూపు తిప్పుకున్నారని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆ రాష్ట్ర ప్రజల వెతలు ప్రధానికి ఏ మాత్రం పట్టడంలేదని దుయ్యబట్టింది.

## మహిళలకు ఊతమివ్వాలి

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు గవర్నర్ సూచన

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకట లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. చైర్ పర్సన్ గా నియామకమైన తర్వాత ఆమె తొలిసారిగా బుధ వారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిశారు. కొండపల్లి బొమ్మ జ్ఞాపికను గవర్నర్‌కు అందించగా ఆయన ఆత్మీయంగా పలకరిం చారు. మహిళా కమిషన్ కార్యక్రమాలను ఈ సందర్భంగా గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. మహిళా సాధికారతతో సహా వివిధ అంశాలపై వెంకట లక్ష్మి వివరణాత్మకంగా చర్చించారు. కుటుంబంలో అత్యంత శక్తిమంతమైన మహిళలకు మహిళా కమిషన్ ఊతమివ్వాలని గవర్నర్ సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్‌లో మహిళా కమిషన్ ప్రోత్సాహం అవసరమన్నారు. వెంకట లక్ష్మి మాట్లాడుతూ.. మహిళలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడమే కాకుండా కమిషన్ వివిధ శిక్షణా కార్యక్రమాల పట్ల దృష్టి సారించినట్లు తెలిపారు. మహిళా సాధికారతకు సంబంధించిన కమిషన్ కార్యక్రమాలకు అన్నివిధాలా అండగా ఉంటానని గవర్నర్ ఆమెకు హామీ ఇచ్చారు.

# బీజేపీ నేతలు హిందూ మత సూత్రాలు అర్థం చేసుకోలేరు

రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: హింస, ద్వేషాన్ని వ్యాప్తి చేసే బీజేపీ నాయకులకు హిందూ మతం ప్రాథమిక సూత్రాలు అర్థం కావడం లేదని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ బుధవారం విమర్శించారు. అహ్మదాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడిన అధికార పార్టీపై ధ్వజమెత్తారు. లోక్‌సభలో గాంధీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా మంగళవారం అహ్మదాబాద్‌లోని గుజరాత్ కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వెలుపల బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నారు. 'ఎక్స్' లో హిందీలో ఒక పోస్టులో గాంధీ ఇలా అన్నారు. 'గుజరాత్ కాంగ్రెస్ కార్యాలయంపై పిరికి, హింసాత్మక దాడి, బీజేపీ, సంఘ్ పరివార్ గురించి నా అభిప్రాయాన్ని మరింత బలపరుస్తుంది' అని అన్నారు. 'గుజరాత్ ప్రజలు వారి అబద్ధాలను స్పష్టంగా చూస్తున్నారు. బీజేపీ ప్రభు త్వానికి నిర్ణయాత్మక గుణ పాఠం నేర్పుతారు. నేను మళ్లీ చెబుతున్నాను. గుజ రాత్‌లో ఇండియా ఐక్య సంఘటన గెలుస్తుంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నేత అన్నారు. 'శాంతియుత నిరసన' పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారని బీజేపీ ఆరోపించగా, హింసాకాండను ప్రారంభించినందుకు ప్రతిపక్ష నాయకులు బీజేపీ కార్యకర్తలను నిందించారు. ఈ ఘటనలో తమ కార్యకర్తలు గాయపడ్డారని, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రెండు వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ గుజరాత్ ప్రధాన కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్ వెలుపల రెండు పార్టీల కార్యకర్తలు పరస్పరం కొట్టుకుంటున్నట్లు స్థానిక టీవీ ఛానెల్ దృశ్యాలు చూపించాయి. పోలీసులు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినప్పటికీ కొందరు వ్యక్తులు ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకోవడం కనిపించింది. కాంగ్రెస్ గుజరాత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు హిమ్మత్ సింగ్ పటేల్ మాట్లాడుతూ 'అన్ని మతాలు అహింసను ప్రబోధిస్తాయి. హింసకు తావు లేదని రాహుల్ గాంధీ చెప్పిన మరుసటి రోజు నిరాశతో బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయంపై దాడి చేశారు. పోలీసుల అనుమతి లేకుండానే వారు నిరసన ప్రదర్శన చేసి మాపై దాడి చేశారు. ఇది గుజరాత్‌లో శాంతిభద్రతల పతనానికి నిదర్శనం' అని విమర్శించారు.

# ఆర్ఎస్ఎస్ రాజ్యాంగ వ్యతిరేకి

నిండు సభలో ప్రధాని అసత్యాలకు నిరసనగా వాకౌట్ చేశాం

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ: అధికార బీజేపీకి సైద్ధాంతిక గురువు ఆర్ఎస్ఎస్ రాజ్యాంగ వ్యతిరేకి అని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. అధికార పక్షం తీరును నిరసిస్తూ ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు నినాదాలు చేస్తూ బుధవారం రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత ఖర్గే మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభలో అబద్ధాలు చెప్పారని అన్నారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చకు మోదీ సమాధానం మధ్యలో రాజ్యసభ నుంచి వాకౌట్ చేసిన ఇండియా ఐక్య సంఘటన ఎంపీలు పాత పార్లమెంటు భవనం సంవిధాన్ సదన్ గేటు వద్ద గుమిగూడారు. ఖర్గేతో పాటు కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, పి.చిదంబరం, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్, డీఎంకేకు చెందిన తిరుచ్చి శివ, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీలు సాగరికా ఘోష్, సుస్మితా దేవ్, జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) కు చెందిన మహువా మాఝీ, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) ఎంపీ మనోజ్ ఝా, శివసేన-యూబీటీ ఎంపీ ప్రియాంక చతుర్వేది హాజరైన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు బదులిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష ఎంపీల వాకౌట్‌ను ఖర్గే సమర్థించుకున్నారు. చర్చలో ప్రధాని సమాధానం ఇస్తూ తప్పుడు సమాచారం అందించినందున వాకౌట్ చేశామని, అబద్ధాలు చెప్పడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం, నిజాలకు వ్యతిరేకంగా మాట్లాడటం ఆయనకు అలవాటని విమర్శించారు. 'రాజ్యాంగంపై ప్రధాని మాట్లాడినప్పుడు... నేను చెప్పదలుచుకున్నాను. మీరు రాజ్యాంగాన్ని రాయలేదు. మీరు దాని ప్రత్యర్థులని. రాజ్యాంగాన్ని ఎవరు సమర్థిస్తారో, ఎవరు వ్యతిరేకిస్తున్నారో స్పష్టం చేయాలి' అని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు నవంబరు 30, 1950 నుంచి ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్' నుంచి వచ్చిన కథనాన్ని ఉటంకిస్తూ, ఆ సంస్థ రాజ్యాంగాన్ని వ్యతిరేకించిందన్నారు. వారు రాజ్యాంగాన్ని వ్యతిరేకించారని, ఇప్పుడు దాన్ని పరిరక్షించడం గురించి మాట్లాడుతున్నారని. వారు మొదటి నుంచి రాజ్యాంగ వ్యతిరేకులని ఖర్గే తెలిపారు. వారు బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దిష్టి బొమ్మలను దహనం చేశారని అన్నారు. బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ అగౌరవపరుస్తుందని మోదీ తరచూ చెబుతుంటారని అన్నారు. రాజ్యాంగ సభలో బాబా సాహెబ్ ఏం చెప్పారో, 'ఆర్గనైజర్' లో ఆర్ఎస్ఎస్ ఏమి రాసిందో చెప్పాలని తాను భావించానని ఖర్గే తెలిపారు. ప్రతిపక్ష నేతను సభలో మాట్లాడనివ్వకపోవడంతో విపక్షాలు వాకౌట్ చేశాయని జేఎంఎం ఎంపీ మాఝీ చెప్పారు. 'కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకుని ప్రధాని కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఖర్గేజీ అనేక సార్లు మాట్లాడేందుకు అనుమతించాలని చెప్పారు. చైర్మన్ అనుమతించలేదు. విపక్ష నేతలంతా ఆయనను అనుమతించాలని డిమాండ్ చేసినా చైర్మన్ పట్టించుకోలేదు' అని జేఎంఎం నేత అన్నారు. 'చైర్మన్ ప్రతిపక్షాల వైపు చూడరు. ప్రతిపక్ష నాయకుడు అవమానించబడ్డారని భావించి మేము వాకౌట్ చేశాం' అని ఆమె తెలిపారు. మోదీ ప్రసంగం మధ్యలో ఖర్గే జోక్యం చేసుకోవడానికి అనుమతించకపోవడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఐక్య సంఘటన పార్టీలు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి. తనను మాట్లాడేం దుకు అనుమతించాలని ఖర్గే చేసిన అభ్యర్థనలను చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పట్టించుకోకపోవడంతో విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. నినా దాల మధ్య మోదీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. తనను మాట్లాడేందుకు అనుమతించాలని ఖర్గే అనేక సార్లు విజ్ఞప్తి చేయడంతో ఇది కొంత సేపు సాగింది. అనుమతి రాకపోవడంతో 'ఇండియా' ఎంపీలు సభ నుంచి వాకౌట్ చేశారు. విపక్ష సభ్యులు ఎగువ సభ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారని ప్రధాని మోదీ మండిపడ్డారు. సభను విపక్షాలు అవమానించడం తగదని, వారి తీరు మారకపోవడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ప్రమోద్ తివారీ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతను మాట్లాడేందుకు అనుమతించడం సభ సంప్రదాయమని అన్నారు. రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష నేత పదవికి బీజేపీ అగౌరవం చూపిందని టీఎంసీ ఎంపీ దేవ్ అన్నారు. 'రాజ్యసభలో ప్రధాన మంత్రి ప్రసంగంలో అబద్ధాల కథ ఉంది. ప్రతిపక్షం జోక్యం చేసుకునే అవకాశం లేకుండా అలాంటి ప్రసంగం ద్వారా కూర్చుంటుందని ఆశించలేం' అని దేవ్ 'ఎక్స్' పై పోస్ట్‌లో పేర్కొన్నారు. ఎల్‌వోపీ రాజ్యాంగ పదవిని బీజేపీ పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వారి ఆదేశం కారణంగా సభలో కూర్చున్న ప్రతిపక్షాల పట్ల నియంతృత్వం ప్రదర్శిస్తోంది' అని టీఎంసీ నాయకుడు అన్నారు.

## కంగనను కొట్టిన కానిస్టేబుల్ బదిలీ...

ముంబై: బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్‌పై బదిలీ వేటు పడింది. కుల్విందర్ కౌర్‌ను చండీగఢ్ విమానాశ్రయం నుంచి బెంగళూరుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఆమె ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నది. జూన్ 7న చండీగఢ్‌లోని షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌కు చెందిన కౌర్... కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టి సస్పెన్షన్‌కు గురి కావడం తెలిసిందే. ఈ ఘటనపై సిట్ దర్యాప్తు పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించింది. రైతుల ఉద్యమాన్ని కించపరిచారన్న ఆగ్రహంతో కంగనను కౌర్ కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియో అప్పట్లో వైరలైంది. కుల్విందర్ కౌర్‌కు కొందరు మద్దతు తెలిపారు.

## పాఠ్యపుస్తకాలు లేకుండా స్కూలుకు...

మరో రెండు నెలలు ఇదే పరిస్థితి

ఎన్‌సీఈఆర్టీ ఆరవ తరగతి విద్యార్థుల్లో గందరగోళం

న్యూఢిల్లీ: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ & ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) పాఠ్యపుస్తకాల జారిలో తీవ్ర జాప్యం ఆరవ తరగతి విద్యార్థులను గందరగోళానికి గురిచేసింది. వారు పాఠ్యపుస్తకాలు లేకుండానే పిల్లలు బడిబాట పట్టాల్సి వచ్చింది. మ్యాథమేటిక్స్, సైన్స్, సోషన్ సైన్స్ పుస్తకాలు ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. ఆన్‌లైన్‌లోనూ ఆంగ్లం, హిందీ, ఉర్దూ పుస్తకాలనే ఉన్నాయి. మార్కెట్‌లోకి పుస్తకాలు రావాలంటే ఇంకో రెండు నెలల సమయం పట్టవచ్చని తెలిసింది. కొత్త విద్యావిధానం -2020, జాతీయ కరికులం కార్యాచరణ (ఎన్‌సీఎఫ్) ఆధారిత కొత్త పాఠ్యపుస్తకాలను మూడు, ఆరవ తరగతుల కోసం ఈ ఏడాదిలో తెస్తామని ఎన్‌సీఈఆర్టీ ముందే ప్రకటించింది. 'మూడవ తరగతి పాఠ్యపుస్తకాలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఆరవ తరగతి పుస్తకాలను రావాలంటే రెండు నెలలు పడుతుంది. ఆలోగా పిల్లలకు కొత్త పుస్తకాలు అందుతాయి. ప్రస్తుతం పాత పుస్తకాలుగానీ కొత్త పస్తకాలుగానీ అందుబాటులో లేక ఆరవ తరగతి విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారు' అని విద్యాశాఖ అధికారి ఒకరు తెలిపారు. ఇదిలావుంటే, 'అవర్ పాస్ట్' (హిస్టరీ), 'అవర్ ఎర్త్-అవర్ హ్యాబిట్యాట్' (జియోలజీ), 'సోషల్&పొలిటికల్ లైఫ్' (పొలిటికల్ సైన్స్) పుస్తకాలను విలీనం చేసే అవకాశాలు ఉన్నట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఎన్‌సీఈఆర్టీకి ఇప్పటివరకు డ్రాఫ్టులను ముద్రణ కోసం ఎన్‌సీటీసీ పంపలేదు కాబట్టి దీనిపై పూర్తి స్పష్టతలేదు. కాగా, మూడవ తరగతికి సంబంధించిన హిందీ, ఉర్దూ, మ్యాథ్స్, ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్, ఆర్ట్స్ పుస్తకాల ముద్రణ, సరఫరా కొనసాగుతున్నట్లు అధికారి చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.